
Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




http://Epepar.telanganaveena.com | శనివారం జూన్ 7 2025 | సంపుటి:2 | సంచి 253 | హైదరాబాద్ | పేజీలు:8 | రూ.3/-

# బీఆర్ఎస్ కాదు అది డీఆర్ఎస్

## అదో దెయ్యాల రాజ్యసమితి

- కవిత వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం
- ఫామ్ హౌజ్‌లో నిద్రపోతున్న దెయ్యాల నేత
- యాదగిరిగుట్ట పర్యటనలో సీఎం రేవంత్ విమర్శలు



తెలంగాణవీణ, భువనగిరి,

పదేళ్లలో ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయిన ఘనత బీఆర్ఎస్‌దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట వద్ద అపచారానికి మూల్యం చెల్లించుకున్నారు. పాపాలు చేసినందునే మీ పరిస్థితి ఆ విధంగా మారింది. తమ పార్టీలో దెయ్యాలు చేరాయని ఆ పార్టీ నాయకురాలే చెప్పారు.

-మిగతా 2 లో






## నీట్- 2025 ఎంట్రన్స్ టెస్ట్ వాయిదా

- ఆఘుష్టు 3న నిర్వహించనున్న ఎన్‌బీఈ
- వాయిదాను అంగీకరించిన సుప్రీం కోర్టు

తెలంగాణవీణ, న్యూఢిల్లీ

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ నీట్-2025 పరీక్షను వాయిదా వేయాలన్న నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అభ్యర్థనకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఆమోదం తెలిపింది. జూన్ 15వ తేదీన జరగాల్సిన పరీక్షను ఆగస్టు 3వ తేదీన నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయమూర్తి పీకే మిశ్రా నేతృత్వంలోని బెంచ్.. పరీక్ష వాయిదాపై కేంద్రాన్ని, ఎన్‌బీఈని ప్రశ్నించింది. 'ఇంకా రెండు నెలలు పరీక్షను వాయిదా వేయటం ఎందుకు..జులై రెండు లేదా మూడో వారంలో పరీక్ష నిర్వహించవచ్చుగా' అని అడిగింది. కేంద్రం తరపున అదనపు సోలిసిటర్

-మిగతా 2 లో




## బనకచర్లతో తెలంగాణకు అన్యాయం

- ఆమోదయోగ్యం కాదంటు కేంద్రానికి లేఖలు
- తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

తెలంగాణవీణ, హైదరాబాద్

బనకచర్లతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంతర్రాష్ట్ర జలవిధానాలకు, జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టు ఉందని ఆక్షేపించారు. ఈ ప్రాజెక్టను తెలంగాణ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని మరోమారు స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరం తెలుపుతూ కేంద్రమంత్రులు సీఆర్‌పాటిల్, నిర్మలా సీతారామన్‌కు లేఖలు రాశామని చెప్పారు. ఏపీ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని..

-మిగతా 2 లో



## అబద్ధాలతో కాలం గడుపుతున్న సీఎం, మంత్రులు

- బనకచర్లపై బీఆర్ఎస్ తరపున సుప్రీంలో కేసు వేస్తాం
- ఏపీ గోదావరి, కృష్ణాలు దోచుకుంటున్నా కళ్లు తెరవరా
- కేంద్రంతో పోరాటం చేయకుండా బీజేపీ సైలెంట్ అయ్యింది
- ఉద్యోగులకు డిఎ పై కేబినేట్‌లో ఇంతగా చర్చలా
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హరీష్ రావు

తెలంగాణవీణ, సిద్దిపేట

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి అనుకున్నం, కానీ ఆయన్ని మించి తాత అయ్యిండు ఉత్తమ్ కుమార్ రెడ్డి అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఉత్తమ్ అబద్ధాలు చూస్తే గోబెల్స్ అనేవాడు ఉంటే ఉరి పెట్టుకునేవాడు అని హరీశ్‌రావు అన్నారు. దుబ్బాకలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు- బీజేపీ

-మిగతా 2 లో



## కేటీఆర్‌కు సుప్రీం నోటీసులు

### రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసు


తెలంగాణవీణ,న్యూఢిల్లీ,

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ చేసిన రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసులో సుప్రీం నోటీసులిచ్చింది. కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంలో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్,

-మిగతా 2 లో

## నేను పారిపోయాను...దొంగను కాను

### నెటిజన్ల కామెంట్లపై విజయ్ మాల్యా స్పందన



తెలంగాణవీణ,లండన్

బ్యాంకులకు రూ.వేల కోట్లు- ఎగవేసి విదేశాల్లో దాక్కొన్న బిలియనీర్ విజయ్ మాల్యా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టయ్యే పరిస్థితులు ఉన్నాయి కాబట్టే తాను భారత్‌ను వీడానని పేర్కొన్నారు. దొంగతనం చేయలేదని.. అసలు దొంగతనం ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు. తాను భారత్ నుంచి పారిపోయానని.. కానీ దొంగను కానని అన్నారు. భారత్ నుంచి వెళ్లిపోయినందుకు నన్ను దేశం నుంచి పారిపోయిన వ్యక్తి అని పిలవండి. కానీ దొంగ

-మిగతా 2 లో



## ఆర్బీఐ సంచలన నిర్ణయం

- వడ్డీరేట్లు మరోమారు తగ్గింపు
- రేపోరేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గింపు
- గృహ,వాహన రుణాలపై తగ్గనున్న వడ్డీలు..ఇంఎంఐలు

తెలంగాణవీణ, ముంబై

ఆర్బీఐ సంచలన నిర్ణయం తీసుకుంది. వరుసగా మూడోసారి వడ్డీరేట్లను తగ్గించింది. రెపోరేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. దీనివల్ల రెపో రేటు 6 శాతం నుంచి 5.50 శాతానికి దిగొచ్చింది. ఆర్బీఐ తీసుకున్న నిర్ణయంతో గృహ రుణాల వడ్డీరేట్లు 7.5 శాతం తగ్గనున్నాయి. అలాగే బ్యాంకు ఈఎంఐలు తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.దేశ ఆర్థిక వృద్ధిని పెంపొందించడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.16 శాతంగా ఉంది. ఎస్‌బీఐ నివేదిక ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరంలో రెపోరేటు- మరో 75 బేసిస్ పాయింట్ల తగ్గింపు జరిగే అవకాశం ఉంటుంది. దీంతో రెపో రేటు- 5.0నుంచి 5.25కు చేరుకోవచ్చు.

-మిగతా 2 లో


## చీనాబ్ రైల్వే వంతెనకు మోడీ పచ్చజెండా

### ఈఫిల్ టవర్‌కన్నా ఎత్తయిన వంతెనగా ప్రసిద్ధి

- కాశ్మీర్‌లో మరో అద్భుతం ఆవిష్కరణ
- రైలు బోగీలో ప్రయాణించిన మోడీ తదితరులు
- శ్రీనగర్-వైష్ణోదేవి మధ్య నేటి నుంచి రాకపోకలు

తెలంగాణవీణ,శ్రీనగర్,

ప్రపంచంలోనే ఎత్తైన చినాబ్ రైల్వే వంతెనను ప్రధాని మోడీ అట్టహాసంగా ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్ తరవాత తొలిసారిగా ప్రధాని మోడీ కాశ్మీర్‌కు వెళ్లారు.శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జమ్ము కశ్మీర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ కేంద్రం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి చీనాబ్ రైలు వంతెనను ప్రధాని ప్రారంభించారు. జెండా ఊపి రైల్వే



వంతెనపై రాకపోకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే బ్రిడ్జిపై పరుగులు తీసిన కోచ్‌లో ప్రధాని ప్రయాణించారు. ఆయన వెంట

-మిగతా 2 లో




## ఈ నెల 18 నుంచి గ్రూప్ -3 సర్టిఫికెట్ వెరిఫికేషన్

- టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ వెల్లడి

తెలంగాణవీణ, హైదరాబాద్,

గ్రూప్ -3 పోస్టుల భర్తీలో భాగంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్‌ను టీజీపీఎస్సీ శుక్రవారం విడుదల చేసింది. ఈ నెల 18 నుంచి జూలై 8వ తేదీ వరకు అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. ఈ షెడ్యూల్లో హాజరుకాలేని వారి కోసం జూలై 9 రిజర్వ్‌డేగా ప్రకటించారు. నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తామని

-మిగతా 2 లో

## బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్..

- మావోయిస్టు మృతి



ఛత్తీస్‌గఢ్

ఛత్తీస్‌గఢ్ లో మరోసారి ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు , భద్రతాబలగాలకు మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి.

-మిగతా 2 లో

# బీఆర్ఎస్ కాదు.. అది డీఆర్ఎస్

(మొదటి పేజి తరువాయి)

జవాబివ్వలేక దెయ్యాల నేత ఫాంహౌస్‌లో నిద్రపోతున్నారు. బీఆర్ఎస్ కాదు.. డీఆర్ఎస్.. దెయ్యాల రాజ్యసమితి. కొరివి దెయ్యాలను తరిమికొట్టే బాధ్యత నేను తీసుకుంటా. అందుకు కార్యకర్తల సహకారం కావాలని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. బంగారు తెలంగాణ ముసుగులో పదేళు దోచుకున్న వాళ్లా నన్ను ప్రశ్నించేది. వాసాలమర్రి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఇళ్లన్నీ కూలగొట్టారు. ఆ తర్వాత కేసీఆర్ ఆ గ్రామాన్ని పట్టించు కోలేదు. పదేళ్లు దోచుకొని రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చారు. రూ.8లక్షల కోట్లు-అప్పులు చేసి ర్ట్రాష్టాన్ని దివాళా తీశారు. విద్యార్థులు, రైతులు, ఉద్యమకారులను పొట్టన పెట్టుకున్నారు. పేదలను తప్పుదోవ పట్టించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. రూ.20లక్షల కోట్లు ఉంటే రూ.2వేల కోట్లతో ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయలేదు అంటూ నిప్పులు చెరిగారు. యాదాద్రిని తిరిగి యాదగిరిగుట్టగా మార్చాం. కొండపై భక్తులు నిద్రించేలా.. ఆటోలు నడిచేలా చేస్తాం. 60 కిలోల బంగారంతో ఆలయ గోపురం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం. టీటీడీ బోర్డు మాదిరిగా తెలంగాణలోనూ వైటీడీ ఏర్పాటు చేశాం. యాదగిరిగుట్టలోని విద్యాసంస్థలను వర్సిటీ స్థాయికి అభివృద్ధి చేస్తాం. ఎవరు అడ్డంపడినా సరే.. మూసీ ప్రక్షాళన చేసి నల్గొండ రైతులను ఆదుకుంటాం. గోదావరి జలాలతో మూసీ నదిని నింపుతాం. సబర్మతి, గంగా నదులు ప్రక్షాళన చేసుకోవచ్చు.. మూసీ నదిని మాత్రం ప్రక్షాళన చేయకూడదా అని ప్రశ్నించారు. సభలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహా, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# అబద్దాలతో కాలం గడుపుతున్న సీఎం, మంత్రులు

(మొదటి పేజి తరువాయి)

ఎంపీలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ సమావేశం నిరాశపరిచిందని మాజీ మంత్రి హరీష్ రావువ్యాఖ్యలు చేశారు. ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. గాలి మోటార్‌పై తిరుగుతూ గాలి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక్క డీఏ ఇచ్చేందుకు ముచ్చటగా మూడు కమిటీలు వేశారని... దీనికి కేబినెట్‌లో అయిదు గంటల చర్చ చేశారని వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిట్ట నిలువునా ముంచుతోందన్నారు. తక్షణమే మూడు డీఏలు చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఉద్యోగస్తులపై సర్కార్ కేసులు పెడుతోందన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి గ్రామాల్లో పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మించిపోయారని వ్యాఖ్యలు చేశారు. ఉత్తమ్ కుమార్ ఏది మాట్లాడినా అబద్దమే అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో క్రాప్ హాలిడే ప్రకటించిందన్నారు. 65 టీఎంసీల నీటిని ఉపయోగించకుండా చేసింది ఉత్తమ్ అంటూ ఆరోపించారు. నీతి ఆయోగ్ మీటింగ్‌లో ప్రధానిని రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. గోదావరి బనకచర్ల కోసం బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టు వెళ్తుందన్నారు. గోదావరి బనకచర్ల మీద బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. శ్రీశైలం రైడింగ్ ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును ఉత్తమ్ కుమార్ రెడ్డి అడ్డుకోవాలన్నారు. కాళేశ్వరం కుప్ప కూలిందని చెప్పే రేవంత్ రెడ్డి గంధమళ్ళకు నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. కాళేశ్వరం కూలిందని కాంగ్రెస్ ప్రభుత్వం గ్లోబల్ ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను స్టే తెచ్చి ఆపిందే బిఆర్ఎస్, కేసీఆర్ అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి విజయవాడకు పోయి చంద్రబాబును కలిసి బజ్జీలు తిని వచ్చిండు. అప్పటి నుంచి ఏం మాట్లాడటం లేదు. కృష్ణా నది జలాల్లో రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు వాడనంత తక్కువ నీళ్లు వాడింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆంధ్రాకు దాసోహం చేసి, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్ నగర్‌లో పంటలను ఎండబెట్టింది కాంగ్రెస్. తాత్కాలిక కేటాయింపుల ప్రకారం, 65 టీ-ఎంసీలు తక్కువ వాడిన చేతగాని దద్దమ్మ ప్రభుత్వం. ఆరున్నర లక్ష ఎకరాలకు నీళ్లు ఇవ్వకపోవడమే, పంట ఎండబెట్టడమే. దీనికి సమాధానం చెప్పు, చెంపేలేసుకొని ముక్కు భూమికి రాయి ఉత్తమ్ కుమార్ రెడ్డి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కేబినెట్‌లో బనకచర్ల గురించి మాట్లాడేందుకు సమయం లేదా? ఇంతకంటే ముఖ్యమైన అంశం ఇంకోటి ఉంటదా? ఐదు గంటలు కమిషన్లు, పర్సెంటీజీలు, హైకమాండ్‌కు పంపే మూటల గురించి మాట్లాడారా? 400 టీఎంసీల గోదావరి జలాలను అక్రమంగా ఏపీ తరలిస్తుంటే గుడ్లు అప్పగించుకొని చూస్తారా? సుప్రీం కోర్టుకు వెళ్లరా, కేంద్ర మంత్రిని కలవరా, నీతి అయోగ్‌లో సీఎం ఎందుకు మాట్లాడలేదు. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. అపెక్స్ కమిటి అనుమతి లేకుండా, అంతర్ రాష్ట్ర అనుమతి లేకుండా, గోదావరి ట్రిబ్యునల్ అనుమతి లేకుండా ప్రాజెక్టు కడుతుంటే ఎందుకు మౌనం. చంద్రబాబును ఎదురించే దమ్ము సత్తా లేదా, ఎందుకు లాగులు తడుస్తున్నాయి. ఎందుకు సుప్రీం కోర్టుకు వెళ్లరు, ఎందుకు ప్రధానిని ప్రశ్నించరు. బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. పూర్తిగా ఏపీకి దాసోహం అయిపోయారు. రాష్ట్రం స్పందించకుంటే సుప్రీం కోర్టుకు బిఆర్ఎస్ వెళ్తుందని చెప్పినం. ఇప్పటికీ ఆ మాటకు కట్టు-బడి ఉన్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. లేఖలు రాసి చేతులు దులుపుకుంటన్నారు. అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకువెళ్లాలి, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేద్దాం పదండి. కృష్ణా నదిలో న్యాయమైన వాటా కిందకి వదిలింది మీరు, గోదావరి బనకచర్ల కడుతుంటే చేతులు కట్టు-కొని చూస్తున్నది మీరు, శ్రీశైలం రైట్ కెనాల్ లైనింగ్ జరుగుతుంటే ఆపకుండా చూస్తున్నది మీరు, బిఆర్ఎస్ లైనింగ్ పనులు ఆపిస్తే ఇప్పుడు మీరు వచ్చాక మొదలు పెట్టారు. తక్షణం ఆ పనులను నిలిపి వేయించాలని డిమాండ్ చేసారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే బిజేపీ పెదవి విప్పడం లేదు. గోదావరి బనకచర్ల మీద బిజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదు. రాష్ట్ర ప్రయోజనాలు బిజెపికి పట్టవా? బనకచర్ల ద్వారా తెలంగాణ గోదావరిలో వాటా కోల్పోయే పరిస్థితి? శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ పూర్తి అయితే రోజుకు 90వేల క్యూసెక్కుల చొప్పున తరలిస్తారు. బిజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కండ్లు తెరవండి. ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవాల్సిన కేఆర్ఎంబీ చంద్రబాబు అడుగులకు మడుగులు ఒత్తుతున్నది. శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ అక్రమ పనులు ఆపడం లేదు? గోదావరి బనకచర్ల అక్రమ ప్రాజెక్టును ఆపడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. గంధమల్ల ప్రాజెక్టు అంటే కాళేశ్వరంలో అంతర్భాగం. కాళేశ్వరం కూలితే గంధమల్లకు నీళ్లు ఎలా వస్తాయి రేవంత్ రెడ్డి. గంధమల్లకు ఎట్ల కొబ్బరి కాయ కొడుతున్నవు. గంధమల్ల, మల్లన్నసాగర్, రంగనాయర్ సాగర్, మిడ్ మానేర్, ఎల్లంపల్లి.. ఇదంతా కాళేశ్వరం కాదా రేవంత్ రెడ్డి. కుప్పకూలింది అని ప్రచారం చేసావు. కాళేశ్వరం కూలితే గంధమల్లకు గోదావరి జిలాలు ఎట్ల వస్తాయి. నువ్వు ఇన్ని రోజులు చేసిన ప్రచారం శుద్ధ తప్పు అని తేటతెల్లమైంది. నువ్వు చేసింది అదంతా గోబెల్స్ ప్రచారం అరని తేలిందన్నారు. మూసీలో గోదావరి నీళ్లు పోస్తా అంటవు, ఎట్ల సాద్యమైతది రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

------

## నీట్- 2025 ఎంట్రన్స్ టెస్ట్ వాయిదా

(మొదటి పేజి తరువాయి)

జనరల్ కేఎం నటరాజ్ స్పందిస్తూ..' లాజిస్టికల్ సవాళ్ల కారణంగా పరీక్ష వాయిదా పడింది. పరీక్ష కేంద్రాల సంఖ్యను రెట్టింపు చేయడం, కఠినమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టడం వంటి వాటి కోసం ఈ నిర్ణయం తీసుకోవటం జరిగింది. చిన్న పొరపాట్లు- పరీక్ష పక్రియపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే పరీక్షను వాయిదా వేయడానికి ఎన్బీఈ నిర్ణయించిందని తెలిపారు.అనంతరం న్యాయమూర్తి మిశ్రా మాట్లాడుతూ.. ' పరీక్ష ఎప్పుడు జరిగినా నిష్పక్షపాతంగా, సమగ్ర భద్రతతో జరగాలని స్పష్టం చేశారు. గత వారం ఇచ్చిన తీర్పును కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. అప్పటి నుంచి మీరు ఏం చేశారంటూ ఎన్‌బీఈని ప్రశ్నించింది. దీనిపై ఎన్‌బీఈ మాట్లాడుతూ.. ' పరీక్ష విషయంలో మేము ఏమాత్రం రాజీ పడదలచుకోవడం లేదని స్పష్టం చేసింది. కాగా, నీట్ పీజీ పరీక్షను రెండు షిఫ్టుల్లో జరపడానికి పర్మిషన్ కోరుతూ ఎన్‌బీఈ గతంలో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దానిపై విచారణ జరిపిన కోర్టు ఎన్‌బీఈ ప్రతిపాదనను తోసిపుచ్చింది. రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరిగితే విద్యార్థులపై చెడుగా ప్రభావం చూపే అవకాశం ఉందని అభిప్రాయపడింది. దేశ వ్యాప్తంగా ఒకే షిఫ్టులో పరీక్ష పెట్టాలని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే పరీక్ష ఒకే షిఫ్టులో జరపడానికి మరింత సమయం కావాలని బోర్డు కోరింది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన కోర్టు ఆగస్టు 3వ తేదీన పరీక్ష జరపడానికి అవకాశం కల్పించింది. ఒకే షిఫ్ట్‌లో పరీక్షను ముగించాలని ఇటీవల అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పరీక్ష నిర్వహణ తేదీని జూన్ 15 నుంచి మార్చుకునేందుకు వీలు కల్పించింది. వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత పరీక్ష (నీట్)కు సంబంధించి ఇటీవల సుప్రీంలో విచారణ జరిగింది. పరీక్షను రెండు షిఫ్ట్‌లలో నిర్వహించడానికి నిరాకరించింది. దానివల్ల కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంది.

## బనకచర్లతో తెలంగాణకు అన్యాయం

(మొదటి పేజి తరువాయి)

వస్తే అన్ని నిబంధనలు పరిశీలిస్తామని పాటిల్ చెప్పారు. చట్టం ప్రకారం ముందుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏపీ ఉల్లంఘనలను పూర్తిగా లేఖల్లో వివరించాం. చట్టవిరుద్ధంగా ఏపీకి కేంద్రం సహకరిస్తుందని అనుకోవట్లేదు. తెలంగాణకు అన్యాయం జరిగితే.. ఎంత వర-కై-నా పోరాడుతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తాం.. వెనక్కి తగ్గేదేలే. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలి. కృష్ణాలో అన్యాయం జరుగుతుంటే పదేళ్లు భారాస సహకరించింది. ఉమ్మడి ఏపీలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 724 టీ-ఎంసీలు ఏపీకి వెళితే భారాస హయాంలో 1,254 టీ-ఎంసీలు తరలించారు. కాళేశ్వరానికి వృథా ఖర్చు చేయకుంటే కృష్ణా ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యేవి. తుమ్మిడిహట్టి దగ్గర కాకుండా.. మేడిగడ్డ వద్ద కట్టడం వల్ల రూ.68వేల కోట్లు- కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు ఖర్చు అయింది. ఏపీకి 512 టీ-ఎంసీలు, తెలంగాణకు 299 టీ-ఎంసీలు చాలని సంతకం చేసింది భారాస ప్రభుత్వం కాదా? కృష్ణా నీళ్లలో అప్పుడు మోసం చేసి ఇప్పుడు భారాస నేతలు నాటకాలు ఆడుతున్నారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు.

## కేటీఆర్‌కు సుప్రీం నోటీసులు

(మొదటి పేజి తరువాయి)

జస్టిస్ సతీశ్ చంద్రశర్మతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందంటూ కేటీఆర్ గతంలో ఆరోపణలు చేశారు. దీంతో కేటీఆర్ చేసిన ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ.. ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేత ఫిర్యాదుతో కేటీఆర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని గతంలోనే కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు.. కేటీఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చింది. అయితే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుగుణ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం విచారణ జరుగగా.. పిటిషన్‌పై సమాధానం చెప్పాలంటూ కేటీఆర్‌కు సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

## నేను పారిపోయాను...దొంగను కాను

(మొదటి పేజి తరువాయి)

అని ముద్ర వేయకండి. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ రుణాల విషయంలో మోసం చేసినట్లు- విజయ్ మాల్యా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దేశం విడిచి వెళ్లిపోయిన ఆయన మార్చి 2016 నుంచీ బ్రిటన్‌లో నివసిస్తున్నారు. మాల్యాను భారత్‌కు రప్పించడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న విషయం విదితమే. తాను తీసుకున్న రుణాలకు అనేక రెట్లు బ్యాంకులు తన నుంచి వసూలు చేశాయని.. అందుకు సంబంధించిన అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని కోరుతూ ఆయన ఇటీవల కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఆర్‌సిబి విజయంతో మాల్యాచేసిన పోస్ట్‌పై వివాదంచెలరేగింది. ఆయన దొంగ అంటూ వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చి ఎగవేతలను కట్టేయాలని సూచించారు. ఈ క్రమంలో మాల్యా స్పందించారు. ముందస్తు ప్రణాళికలో భాగంగానే 2016లో నేను భారత్ నుంచి విదేశాలకు వెళ్లాను. కొన్ని కారణాల వల్ల తిరిగి రాలేకపోయాను. ఈ దొంగతనం అనే విషయం ఎక్కడి నుంచి వచ్చింది. భారత్‌లో న్యాయమైన విచారణ, గౌరవప్రదమైన జీవితం ఉంటుందని హామీ ఇస్తే దేశానికి తిరిగి వచ్చే విషయం గురించి ఆలోచించేవాడిని.. కానీ ఆ విధంగా ఉండదని నాకు తెలుసని మాల్యా అన్నారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ పునర్నిర్మాణ ప్రణాళికతో తాను అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీని సంప్రదించి.. తాను సమస్యల్లో ఉన్నట్లు ఆయనకు చెప్పానని మాల్యా అన్నారు.

## బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్..

(మొదటి పేజి తరువాయి)

ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి చెందాడు. ఘటనాస్థలి నుంచి ఏకే-47, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా బలగాలు పాల్గొన్నాయి. ప్రస్తుతం అక్కడ ఆపరేషన్ కొనసాగుతోంది.బీజాపూర్ జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత లక్ష్మీనర్సింహాచలం అలియాస్ గౌతమ్ అలియాస్ సుధాకర్ అలియాస్ బండి ప్రకాశ్ మరణించిన విషయం తెలిసిందే. బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు జిల్లా రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీఎఫ్) భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి.

## చీనాబ్ రైల్వే వంతెనకు మోడీ పచ్చజెండా

(మొదటి పేజి తరువాయి)

కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా కూడా ఉన్నారు. భారత దేశం మరో అద్భుత కట్టడానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మాణం జరిగింది. చీనాబ్ రైల్వే బ్రిడ్జిగా పిలువబడుతున్న ఈ బ్రిడ్జి శుక్రవారం ఉదయం ప్రారంభం అయింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం ఉదమ్‌పూర్.. శ్రీనగర్.. బారాముల్లా రైల్ లింక్ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు.. ఈ చినాబ్ రైల్వే వంతెన ఈఫిల్ టవర్ కంటే ఎత్తుగా ఉంటుంది. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెన చినాబ్ సొంతం. అలాంటి రైల్వే వంతెనను ప్రధాని మోడీ శుక్రవారం జాతికి అంకింతం చేశారు. రూ.46వేల కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైలును కూడా జెండా ఊపి ప్రారంభించారు. వంతెన కారణంగా ఈ మార్గం ప్రధానంగా పర్యాటరంగాన్ని మరింత ఆకర్షించనుంది. శ్రీ మాతా వైష్ణో దేవి ఆలయాన్ని వందలాది మంది యాత్రికులు దర్శిస్తుంటారు. ఈ రైల్వే వంతెన ప్రారంభంతో పర్యాటకరంగంగా మరింత పుంజుకోనుంది. ఈ చినాబ్ బ్రిడ్జి 1,315 మీటర్లు విస్తరించి ఉంది. కఠినమైన వాతావరణాన్ని కూడా ఈ వంతెన తట్టు-కోగలదు. ఈ ప్రాంతం భూకంపం జోన్ 5లో ఉంది. ఇంజనీర్లు అత్యంత అద్భుతంగా ప్రణాళికలు వేసి ఈ బ్రిడ్జిని నిర్మించారు. గంటకు 260 కిలోమీటర్ల వేగంతో ప్రచండమైన గాలులు వీచినా ఈ వంతెనకు ఏం కాదు. బలమైన గాలులు తట్టుకునే విధంగా నిర్మించారు. ఇక వంతెన నిర్మించడానికి దాదాపు 30,000 టన్నుల ఉక్కును ఉపయోగించారు. ప్రస్తుతం ఇదే ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెనగా నిలుస్తుంది. చీనాబ్ వంతెన నిర్మాణం 2002లో వాజ్‌పేయ్ హయాంలో ప్రారంభించగా 2022లో మోడీ హయాంలో పూర్తయ్యింది. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు మార్గం ప్రాజెక్టులో భాగంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి విజయవంతంగా ముగించారు. శనివారం నుంచి శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా రైల్వే స్టేషన్ నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైళ్లు పరిగెత్తనున్నాయి. ప్రధాని ప్రారంభించిన చీనాబ్ రైల్వే బ్రిడ్జి ప్రత్యేకతల విషయానికి వస్తే.. ఇది ఈఫిల్ టవర్ కంటే చాలా ఎత్తైనది. ఈఫిల్ టవర్ ఎత్తు 330 మీటర్లు మాత్రమే. కానీ, ఈ బ్రిడ్జి ఏకంగా 359 మీటర్ల ఎత్తులో ఉంది. ఈ బ్రిడ్జి పొడవు 1,315 మీటర్లు. కట్టింగ్ ఎడ్జ్ ఇంజనీరింగ్ టెక్నాలజీతో దీన్ని నిర్మించారు. ఈ బ్రిడ్జి గంటకు 266 కిలోమీటర్ల వేగంతో గాలి వీచినా కూడా ఏమాత్రం చెక్కు చెదరదు. ఈ బ్రిడ్జిలో ఆసక్తికరమైన మరో ప్రత్యేకత ఏంటంటే.. ఆ బ్రిడ్జి బ్లాస్ట్ రెసిస్టంట్ స్టీలు, కాంక్రీట్‌తో తయారు అయింది. బాంబు దాడులను

## ఈ నెల 18 నుంచి గ్రూప్ -3 సర్టిఫికెట్ వెరిఫికేషన్

(మొదటి పేజి తరువాయి)

తెలిపారు. 1,388 పోస్టుల భర్తీకి గ్రూప్ -3 నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. రాత పరీక్షను నిర్వహించడంతో పాటు ఫలితాల విడుదలలో భాగంగా టీజీపీఎస్సీ జీఆర్ఎల్‌ను సైతం ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే తాగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్‌తో పాటు.. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే వారి వివరాలను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఈ నెల 1 7 నుంచి జూలై 9 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చని కమిషన్ తెలిపింది.

**16న గ్రూప్ -1 సర్టిఫికెట్ వెరిఫికేషన్..**

గ్రూప్ -1 పోస్టుల భర్తీలో భాగంగా మరికొందరు అభ్యర్థులకు ఈ నెల 16న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్లు టీజీపీఎస్సీ వెల్లడించింది. ఇప్పటికే రెండు విడతల వెరిఫికేషన్ ముగియగా, మూడో విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే వారి వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని కమిషన్ వెల్లడించింది. హాజరుకాలేని వారి కోసం ఈ నెల 17న రిజర్వుడేగా ప్రకటించారు. పూర్తి వివరాల కోసం కమిషన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని నవీన్ నికోలస్ తెలిపారు.

## ఆర్బీఐ సంచలన నిర్ణయం

(మొదటి పేజి తరువాయి)

దీనివల్ల బ్యాంకులు కూడా రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించడానికి వీలుంటుంది. వడ్డీ రేట్లను తగ్గించడం ఈ ఏడాదిలో వరుసగా ఇది మూడోసారి అని చెప్పాలి. ఫిబ్రవరి, ఏప్రిల్‌లో 25 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గించారు. తాజాగా మళ్లీ వడ్డీ రేట్లు తగ్గించడం ద్వారా వివిధ రకాల ప్రయోజనాలు కలగనున్నాయి. గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశం ఉంటుంది. కాబట్టి రుణాలు తీసుకున్న వారందరికీ ఇది శుభవార్త అనే చెప్పాలి. నెలవారీ చెల్లింపుల వాయిదా భారం మోస్తున్న గృహ వినియోగదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి శుభవార్త చెప్పిందనే అనుకోవాలి. కీలక వడ్డీరేట్లను ఏకంగా 50 బేసిస్ పాయింట్లు- తగ్గించి మరింత ఊరట కల్పించింది. తాజా నిర్ణయంతో గృహ రుణగ్రహీతలపై ఈఎంఐ భారం మరింత తగ్గనుంది.ఫ్లోటింగ్ రేట్‌పై గృహ రుణాన్ని తీసుకున్న వారికి సవరించిన వడ్డీరేటు-ఆధారంగా ఊరట లభించనుంది. 2019 అక్టోబర్ 1 తర్వాత జారీ చేసిన గృహ రుణాలన్నీ ఫ్లోటింగ్ రేటు-తో జారీ అయినవే. కాబట్టి వారికి బ్యాంకులు ఆ మేరకు వడ్డీ రేట్లను సవరిస్తాయి. పాత వినియోగదారులకే కాదు.. కొత్తగా రుణాలు తీసుకునేవారు తక్కువ వడ్డీకే రుణాలు పొందొచ్చు.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811



# కర్ణాటక సీఎంకు బాంబు బెదిరింపులు.. ఆత్మాహుతి దాడికి ప్లాన్



**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**

దేశంలో బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. తాజాగా కర్ణాటక ముఖ్యమంత్రి నివాసానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. సీఎం కార్యాలయంతోపాటు బెంగళూరులోని కోరమంగళలో గల రీజనల్ పాస్‌పోర్ట్ కార్యాలయానికి కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. సీఎం నివాసం, పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకొని ఆత్మాహుతి బాంబర్లు దాడి చేస్తారని హెచ్చరించారు.శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఈమెయిల్ ద్వారా ఈ బెదిరింపులు వచ్చాయి. మధ్యాహ్నం 3:15 గంటల ప్రాంతంలో దాడికి ప్రణాళిక వేసినట్లు అందులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. బెదిరింపు మెయిల్‌పై అప్రమత్తమైన పోలీసులు అలర్ట్ అయ్యారు. రెండు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# ప్రపంచం చీదరించుకునే దేశాల్లో చైనా టాప్

-అమెరికాకు రెండో ర్యాంక్
-పదో స్థానంలో భారత్



**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**

ప్రపంచమంతా ఓ కుగ్రామంగా మారుతున్నప్పటికీ, వివిధ దేశాల పట్ల ప్రజలకు ద్వేషం, అపనమ్మకం కూడా పెరుగుతున్నాయి. 'న్యూస్‌వీక్' విడుదల చేసిన వరల్డ్ పాపులేషన్ రివ్యూ నివేదిక ప్రకారం, ప్రపంచ ప్రజలు చీదరించుకుంటున్న, ద్వేషిస్తున్న దేశాల జాబితాలో మొదటి స్థానంలో చైనా ఉంది. రెండో స్థానంలో అమెరికా, మూడో స్థానంలో రష్యా ఉన్నాయి. భారత్ పదో స్థానంలో ఉంది.చైనాను ప్రపంచ ప్రజలు అసహ్యించుకోవడానికి కారణాలు ఏమిటంటే, ఆ దేశంలో నియంతృత్వ పాలన, సెన్సార్‌షిప్, పర్యావరణానికి నష్టం కలిగించడం, వీగర్ ముస్లింల పట్ల వ్యవహరిస్తున్న తీరు. అమెరికా 'సూపర్‌పవర్' మెంటాలిటీ, ఆయుధాల పట్ల మోజు, జోక్యం చేసుకునే వైఖరి వంటివి ఆ దేశాన్ని ద్వేషించేలా చేస్తున్నాయి. రష్యాపై ద్వేషానికి కారణాలు.. ఉక్రెయిన్‌పై యుద్ధం, ప్రజాస్వామిక హక్కులపై ఉక్కుపాదం మోపడం.

# భారత్‌లో స్టార్ లింక్ సేవలకు అనుమతి




**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**

ఏ భారత్‌లో స్టార్ లింక్ ఇంటర్నెట్ సేవలకు అనుమతి లభించింది. దేశంలో మూడో ఇంటర్నెట్ కంపెనీగా స్టార్ లింక్ ఏర్పాటు కాబోతోంది. ఈ విషయాన్ని ఆ సంస్థ అధినేత ఎలాన్ మస్క్ అధికారికంగా ప్రకటించారు. ఇదిలా ఉంటే.. ఎలాన్‌మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ స్టార్‌లింక్ ఇంటర్నెట్ సర్వీసులను అందిస్తోంది. శాటిలైట్ టెక్నాలజీ ద్వారా హైస్పీడ్, తక్కువ లేటెన్సీతో ఇంటర్నెట్ సర్వీసులను అందించనుంది. ఇప్పటికే తమ కస్టమర్లకు స్టార్ లింక్ సేవలను అందించేందుకు దేశీయ టెలికాం కంపెనీలైన జియో, ఎయిర్‌టెల్ ఇప్పటికే స్టార్ లింక్‌తో ఒప్పందం చేసుకున్నాయి. మారుమూల ప్రాంతాలు, కొండ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలందించేందుకు స్టార్ లింక్ ఉపయోగపడుతుంది. సగటున 50 ఎంబీపీఎస్ నుంచి 150 ఎంబీపీఎస్ వేగంతో ఈ సేవలు లభిస్తాయి. స్పేస్‌ఎక్స్ అనుబంధ స్టార్‌లింక్ ఇప్పటికే శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను 100 దేశాల్లో అందిస్తోంది.

# జీ 7 సమ్మిట్‌కు మోదీని ఆహ్వానించిన కెనడా ప్రధాని



**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**

కెనడాలో జరుగనున్న జీ 7 దేశాల శిఖరాగ్ర సమావేశం కోసం ప్రధాని నరేంద్ర మోదీకి ఆహ్వానం అందింది. కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ ఈ మేరకు మోదీకి ఫోన్ చేసి ఆహ్వానం పలికారు. కెనడాలోని కననాస్కిస్‌లో జరిగే జీ 7 శిఖరాగ్ర సమావేశానికి హాజరు కావాలని కోరారు. ప్రధాని మోదీ ఈ విషయాన్ని ధృవీకరించారు. తాను పాల్గొంటానని ఆయన తెలిపారు. 'కెనడా ప్రధాన మంత్రి మార్క్ జె కార్నీ నుంచి ఫోల్ కాల్ రావడం ఆనందంగా ఉంది. ఇటీవలి ఎన్నికల విజయంపై ఆయనను అభినందించా. ఈ నెల చివర్లో కననాస్కిస్‌లో జరిగే జీ 7 శిఖరాగ్ర సమావేశానికి ఆహ్వానించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపా. ప్రజల మధ్య బలమైన సంబంధాలతో ముడిపడి ఉన్న శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశాలుగా భారత్, కెనడా పరస్పరం గౌరవం పొందాయి. నూతన శక్తితో కలిసి పనిచేస్తాం. శిఖరాగ్ర సమావేశంలో మన మీటింగ్ కోసం ఎదురు చూస్తున్నా' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.కాగా, భారత్, కెనడా మధ్య ఉన్న నెలకొన్న విభేదాల కారణంగా జీ 7 సమ్మిట్‌కు ప్రధాని మోదీ దూరంగా ఉంటారన్న ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే కెనడా ఎన్నికల్లో నిర్ణయాత్మక విజయం సాధించిన తర్వాత కార్నీ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. అనంతరం మోదీ, కార్నీ మధ్య జరిగిన తొలి అధికారిక సంభాషణ ఇది.






# రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన కమల్ హాసన్

**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**

ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ వ్యవస్థాపకుడు కమల్ హాసన్ రాజ్యసభ కు నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం తమిళనాడు సచివాలయంలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ సమక్షంలో నామినేషన్ దాఖలు చేశారు.కాగా, ఇటీవలే చెన్నైలో నిర్వహించిన తన చిత్రం 'థగ్ లైఫ్' ఈవెంట్‌లో కన్నడ భాషపై ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. దాంతో బుధవారం వేయాల్సిన రాజ్యసభ నామినేషన్‌ను కమల్ వాయిదా వేసుకున్నారు. సినిమా వ్యవహారాలు పూర్తయిన తర్వాతే నామినేషన్ వేయాలని భావిస్తున్నట్లు అప్పట్లో తెలిపారు. అయితే, 'థగ్ లైఫ్' చిత్రం గురువారం విడుదల కావడంతో నేడు నామినేషన్ దాఖలు చేశారు. కమల్‌తో పాటు మరో



ముగ్గురు డీఎంకే నేతలు రాజ్యసభకు నామినేషన్ వేశారు. సిట్టింగ్ ఎంపీ, సీనియర్ న్యాయవాది పి విల్సన్, రోకియా మాలిక్, మాజీ ఎమ్మెల్యే శివలింగం రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. కాగా, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి కమల్ హాసన్ పార్టీ మక్కల్ నీది మయ్యం పూర్తి మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే. అంతేకాదు డీఎంకే తరపున ఆయన తమిళనాడులో ప్రచారం కూడా చేశారు. దాంతో ఆయన రాజ్యసభలో అడుగుపెట్టేందుకు డీఎంకే పూర్తి సహకారం అందించనుంది. జూన్ 19న జరిగే రాజ్యసభ ద్వై వార్షిక ఎన్నికల్లో ఆయనను పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేసినట్టు ఎంఎన్ఎం గత వారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఎంఎన్ఎం కమల్ హాసన్ పేరును ప్రతిపాదించగానే రాజ్యసభ సీటును ఆయనకు కేటాయిస్తున్నట్టు మిత్రపక్ష పార్టీ డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. 2024లో ఎంఎన్ఎం పార్టీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని అనుసరించి స్టాలిన్ ఈ కేటాయింపు చేశారని పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, ప్రస్తుతం ఎంఎన్ఎం పార్టీకి శాసనసభ, పార్లమెంట్‌లో ఎలాంటి ప్రాతినిధ్యం లేదు.

# మేఘాలయలో వీడని దంపతుల మిస్టరీ

-నవ వధువు సోనమ్ కోసం ముమ్మర గాలింపు
-కేసును సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం

**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**

మేఘాలయ మర్డర్ కేసు మిస్టరీ వీడడం లేదు. కొత్తగా పెళ్లయి ఈశాన్య రాష్ట్రమైన మేఘాలయకి హనీమూన్ వెళ్లిన ఇద్దరు కొత్త దంపతుల్ని హత్య, కిడ్నాప్ చేసిన సంగతి తెలిసిందే. భర్త రాజా రఘువంశీని కిరాతకులు కత్తితో పొడిచి చంపి లోయలో పడేశారు. అతని మృతదేహం డ్రోన్ల సాయంతో కనుగొన్నారు. అయితే, నవ వధువు సోనమ్ రఘువంశీ ఆచూకీ మాత్రం ఇప్పటికీ దొరకడం లేదు. మే 24న ఈ దారుణం చోటుచేసుకోగా ఇంకా సోనమ్ ఆచూకీ దొరక్కపోవడంతో ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కి అప్పగించాలని బాధిత కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు. నవ దంపతులు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌కు చెందినవారు. రాజా రఘువంశీ, అతని భార్య సోనమ్ అదృశ్యం కావడానికి



ఒక రోజు ముందు షిల్లాంగ్ లోని ఒక హోటల్‌లో దంపతులిద్దరూ నడుస్తూ వెళ్తున్న దృశ్యాలు కొత్తగా బయటపడ్డ సిసి ఫుటేజ్‌లో కనుగొన్నారు. ఈ ఫుటేజ్ ఆధారంగా ఈ కేసులో కుట్ర కోణం కూడా ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మర్డర్ మిస్టరీని దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు- చేసింది మేఘాలయ సర్కార్. మేఘాలయ పోలీసులు దీన్ని హత్య, కిడ్నాప్ కేసుగా నమోదు చేశారు. ఈ జంట అదృశ్యం కావడానికి ముందు హైకింగ్‌కు వెళ్లే సమయంలో సోనమ్ తన ఫ్యామిలీతో మాట్లాడింది. ఇదే ఆమె చేసిన చివరి ఫోన్ కాల్. టూర్ కోసం దంపతులిద్దరూ స్థానికంగా ఒక స్కూటర్‌ను అద్దెకు తీసుకున్నారు. మే 24న తూర్పు ఖాసీ హిల్స్‌లోని సోహ్రారిమ్‌లో ఆ స్కూటర్ పార్క్ చేసి ఉంది. స్కూటర్ దొరికిన ప్రదేశానికి కొంత దూరంలో మే 30వ తేదీన సోమవారం నాడు లోయలో రాజా రఘువంశీ మృతదేహం కనుగొన్నారు. అక్కడే రాజా ఫోన్, అతన్ని చంపడానికి ఉపయోగించినట్లు- భావిస్తున్న కత్తినీ కనుగొన్నారు. ఇది హత్య కేసని స్పష్టంగా తెలుస్తుందని.. రాజా హత్యకు గురయ్యారని అందులో ఎటువంటి సందేహం లేదని తూర్పు ఖాసీ హిల్స్ ఎస్పీ అన్నారు. మేఘాలయ పోలీసులు హత్య కేసు నమోదు చేసి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. అయితే, సోనమ్ రఘువంశీ ఆచూకీ ఇప్పటికీ దొరకలేదు. ఆమె కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. దర్యాప్తు సంస్థలూ సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నాయి

# పాకిస్తాన్‌లో ప్రభుత్వ పాఠశాలపై బాంబు దాడి..

**తెలంగాణవీణ, హైదరాబాద్**

పాకిస్తాన్‌లోని ప్రభుత్వ పాఠశాలపై బాంబు దాడి జరిగింది. వాయువ్య పాకిస్తాన్‌లోని ఖైబర్ ఫక్తుంక్వా ప్రావిన్స్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలపై శుక్రవారం ఉదయం గుర్తుతెలియని దుండగులు బాంబు దాడి చేసినట్లు అధికారులు తెలిపారు. తంక్ జిల్లాలోని గుల్ ఇమామ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగిందని అన్నారు. పేలుడు పదార్థాలను వినియోగించడంతో పాఠశాలలోని పలు తరగతి గదులు కూలిపోయాయని



అన్నారు. అయితే ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్లు ఏ సంస్థ ఇప్పటివరకు ప్రకటించలేదు. నిషేధిత తెహ్రీక్-తాలిబన్-పాకిస్తాన్ (టిటిపి)కి చెందిన అనుబంధ సంస్థలు తంక్ జిల్లాలో చురుకుగా వ్యవహరిస్తున్నాయి. ఈ సంస్థలు బాలికల విద్యకు, పాఠశాలలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. గత దశాబ్ద కాలంగా ఖైబర్ ఫక్తుంక్వా ప్రావిన్స్‌లో 450కి పైగా పాఠశాలలను ఇదే తరహాలో కూల్చివేసినట్లు స్థానిక ఎన్‌జిఒ నివేదికలో తెలిపింది.

# కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ
# ప్రకటించి,శాంతి చర్చలు జరపాలి





**-రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన నేతల డిమాండ్.**

**-ఈ నెల 14న ఇందిరాపార్కు వద్ద జరగబోయే మహాధర్నా విజయవంతం చేయాలని పిలుపు.**

తెలంగాణవీణ,కుషాయిగూడ ...

కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టు పార్టీతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలని ప్రజా సంఘాలు, అఖిల పక్ష నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం కాప్రా సిపిఐ కార్యాలయంలో, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అఖిల పక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఉమామహేశ్వర్ సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి అధ్యక్షతన జరిగిన సమావేశంలోసి కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకురాలు అనురాధ, ఐ.ఎఫ్.టీ.యు. శివబాబు, సిపిఎం జిల్లా సెక్రటరీ సత్యం, రవి, శంకర్, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ వి.ప్రవీణ్ కుమార్, పిడిఎం చంద్రమౌళి, పి ఉమామహేశ్వర్ సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి అధ్యక్షతన జరిగిన సమావేశంలోసి అఖిల పక్ష పార్టీల కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి,సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకురాలు అనురాధ, ఐ.ఎఫ్.టీ.యు. శివబాబు, సిపిఎం జిల్లా సెక్రటరీ సత్యం, రవి, శంకర్, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ వి.ప్రవీణ్ కుమార్, పిడిఎం చంద్రమౌళి, పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునీత, ఇఫ్టూ షేక్ షావలి, బిఎల్ఎఫ్, బి ఎన్ ఆర్ కే ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కామెర్ల ఐలయ్య, తదితర సంఘాలు, పార్టీలకు చెందిన నేతలు హాజరై ప్రసంగించారు. ఆదివాసిల హననం చేసే ఆపరేషన్ కగార్ ను నిలిపివేసి, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని ముక్త కంఠంతో డిమాండ్ చేశారు . గత 17 నెలలుగా జరిగిన కగార్(అంతిమ యుద్ధం) పేరుమీద సుమారు 550 మందిని పొట్టనపెట్టుకున్నారని ఆరోపించారు. ఈదేశ ప్రజలపై పరాయి శత్రు దేశాలపై చేసిన దాడులలో ఎలాగైతే అదునాతనమైన యుద్ద మందుగుండు సామాగ్రిలతో డ్రోన్లు, యుద్ధ టాంకర్లు, హెలికాప్టర్లు, లక్షలాది మంది భద్రతా బలగాలతో దాడులు చేస్తున్నారో, అదే తరహాలో ఆదివాసులపై, వారికి అండగా నిలిచిన మావోస్టులపై కొనసాగించడాన్ని తీవ్రంగా ఖండించారు. వారిని వెంటాడి, వేటాడి హతమార్చడం భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య స్పూర్తికే విరద్ధమని, ఇలాంటి చర్యలు ఈదేశ ప్రజల జీవించే హక్కును కాలరాయడమేనని ఎండగట్టారు. ఆదానీ, అంబానీ లాంటి బడా కార్పొరేట్ లాంటి సంస్థలకు అటవీ సంపదలు, సహజవనరుల దోపిడీకి ఎర్రతివాచీ పరిచాయాని ఆగ్రహించారు.ఆదివాసి ప్రజలపై జరుగుతున్న వరుస మానవ హనన నివారణకు కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపేలా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్వహించాల్సిన అవసరం గుర్తించారు. అందులో బాగంగా ఈ నెల 14 న హైదరాబాద్ ఇందిరాపార్కులో మహాదర్నా కార్యక్రమాన్ని చేపట్టాలని తీర్మానించారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో 14 వ తేదీన ఆపరేషన్ కగార్ ను ఎత్తివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి .దామోదర్ రెడ్డి, శంకర్రావు, తోటపల్లి శంకర్, గద్దర్ అభిమాన సంఘాల అధ్యక్షులు సీఎల్. యాదగిరి, ఏ ఐ వై ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి, సిపిఎం జిల్లా కార్మిక సభ్యులు కోమటి రవి, జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య

**-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**





తెలంగాణ వీణ/ చేగుంట...

బడిబాటలో భాగంగా మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలోని సుభాష్ నగర్ లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, మెదక్ జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధా కిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య , ప్రభుత్వ పాఠశాలల లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పిల్లలకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు విద్యను అందిస్తున్నారని, ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్ అందిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఇప్పుడు అన్ని రంగాలలోఉన్నారు అని, పదవ తరగతి పూర్తయిన విద్యార్థులు పై తరగతులలో చేరాలని వారు అన్నారు, మెదక్ జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధాకిషన్ మాట్లాడుతూ నేను ఒకటవ తరగతి నుంచి పి హెచ్ డి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివానని, ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నీరజ, ఎంపీడీఓ చెన్నారెడ్డి, ఏపీఎం లక్ష్మీ నరసమ్మ, ఉపాధ్యాయులు చల్లా లక్ష్మణ్, శ్రీనివాస్, యాదగిరి, కవిత,వెంకటేష్, రేఖ, రాధా, శారదా, రఘుపతి, సుధాకర్ రెడ్డి, సురేందర్,రాజేశ్వర్, మనోహర్, రమాదేవి, భవాని,సరస్వతి,శ్రీవాణి, సిద్దిరాములు, ఉమా,అంగన్ వాడి ఉపాధ్యాయులు స్వర్ణ లత,రేణుక, రాణీ, సుగుణ, పద్మ, వాణి, సి ఆర్ పి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# బోర్ వేసే ముందు
# తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి....

**-ఉప్పల్ తహసిల్దార్ టి. వాణిరెడ్డి**






తెలంగాణ వీణ,ఉప్పల్...

ఉప్పల్ మండల పరిధిలో బోర్ వేయాలనుకునే వారు ముందుగా ఎమ్మార్వో కార్యాలయం నుండి అనుమతి తీసుకోవాల్సిందేనని తహశీల్దార్ టి.వాణి రెడ్డి హెచ్చరించారు.అనుమతి లేకుండా బోర్లు వేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు.ప్రభుత్వం వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో, అక్రమ బోర్ల తవ్వకాలను నిరోధించేందుకు అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ భగయత్ ప్రాంతంలో అనుమతి లేకుండా తవ్విన 2 బోర్లను అధికారులు సీజ్ చేశారు.ఎమ్మార్వో టి,వాణి రెడ్డి,డిప్యూటీ తహశీల్దార్ సునీల్ కుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ పి,సామ్సన్ పాల్,జూనియర్ అసిస్టెంట్ వెంకన్న బోర్లపై చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ,అనుమతి లేకుండా బోర్ వేసే వారు కఠిన చర్యలను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమణ నుంచి రక్షించడంలో తహశీల్దార్ కార్యాలయం కీలకంగా వ్యవహరిస్తోందని తెలిపారు.తహశీల్దార్ ఆధ్వర్యంలో జరిగిన ఆకస్మిక తనిఖీల్లో అనుమతి లేని బోర్లు బయటపడిన వెంటనే చర్యలు తీసుకొని భూమిని తిరిగి ప్రభుత్వ అధీనంలోకి తీసుకున్నారు.ఈ విధానంతో ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్న తహశీల్దార్‌కు స్థానికులు అభినందనలు తెలిపారు.ప్రజల ఆరోగ్య భద్రతకే కాకుండా భవిష్యత్తు తరాల కోసం నీటి వనరుల పరిరక్షణకు ఈ చర్యలు మేలు చేస్తాయని వారు అభిప్రాయపడ్డారు.

# కాశ బోయిన బ్రదర్స్ వారి ఆహ్వానాన్ని గౌరవించి
# వారి స్వగృహమునకు విచ్చేసిన నీలం మధు ముదిరాజ్



తెలంగాణ వీణ /చేగుంట...

మెదక్ జిల్లా, చేగుంట మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కాశబోయిన బ్రదర్స్ గత కొంతకాలంగా ములుగు మండలంలోని వంటి మామిడి గ్రామం లో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు నీలం మధు ముదిరాజ్ సేవలకు ఆకర్షితులై, వారిపై ఉన్న అభిమానంతో గత కొంతకాలంగా ఎన్.ఎం.ఆర్ యువసేనలో చేరి అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ,సోషల్ మీడియా సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టి ఎన్ ఎం ఆర్ యువసేనను పలు జిల్లాలకు విస్తరింప చేస్తు నీలం మధు ముదిరాజ్ మీద ఉన్న అభిమానాన్ని చాటుకుంటున్నారు, ఈరోజు నీలం మధు ముదిరాజ్ పర్యటన సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ మండలంలో మరియు మర్కుక్ మండలంలో నూతనంగా నిర్మించి ప్రతిష్టించిన శ్రీశ్రీ పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని వెళుతూ ,ములుగు మండలంలోని వంటిమామిడి గ్రామంలోని కాశ బోయిన బ్రదర్స్ (కాశబోయిన స్వామి ,నవీన్ ,శేఖర్ ) వారి ఆహ్వానంతో వారింటికి విచ్చేశారు, ఆహ్వానితులు నీళ్ల మధు ముదిరాజ్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ తలారి బిక్షపతి ముదిరాజ్,వంటిమామిడి ఏ ఎం సి ఎక్స్ డైరెక్టర్ శ్రీ నిమ్మకాయల గణేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వడియారంలో బడిబాట గ్రామసభ

**-"బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి.**

**-ఎంపీడీవో చిన్నారెడ్డి"**





తెలంగాణ వీణ/ చేగుంట...

మెదక్ జిల్లా, చేగుంట మండలంలోని వడియారం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "బడిబాట" కార్యక్రమంలో భాగంగా గ్రామసభ జరిగింది.

ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వపరంగా అన్ని మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నటువంటి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చదివించాలని, నాణ్యమైనటువంటి విద్యను పొందాలని సూచించారు.ఉన్నత పాఠశాల హెచ్.ఎమ్. లీలావతి విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించినట్లయితే భవిష్యత్తులో అనేక ప్రయోజనాలు పొందుతారని పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్.ఎమ్. సిద్ధిరాములు మాట్లాడుతూ విద్యార్థులను ప్రయోజకులుగా చేయడానికి పునాది "ప్రాథమిక విద్య" అని పేర్కొంటూ తమ పాఠశాలలో ఆటపాటల ద్వారా గుణాత్మక విద్య అందిస్తున్నామని, చదవడం-రాయడంతో పాటు గణితంలో చతుర్విధ ప్రక్రియలను సులభంగా నేర్చుకుంటారని తెలియజేశారు. "బడిబాట గ్రామసభ" లో ఉన్నత పాఠశాల సిబ్బంది, ప్రాథమిక పాఠశాల సిబ్బంది, గ్రామ కార్యదర్శి, ఆదర్శ పాఠశాల చైర్మన్, అంగన్వాడి కార్యకర్తలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఈసీఐఎల్ మజ్దూర్ సంఘ్ డిమాండ్లకు బీజేపీ మద్దతు..

తెలంగాణవీణ,కాప్రా ...
ఈసీఐఎల్ లో కంపెనీలో గ్రూప్ సీ, డీ ఉద్యోగ నియమాకల్లో స్థానికులు తగిన ప్రాధాన్యత కల్పించాలని ఈఇసీఐఎల్ మజ్దూర్ సంఘ్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఈసీఐఎల్ మజ్దూర్ యూనియన్ కార్యాయలంలో టెక్నీషియన్ రిక్రూట్మెంట్ పై నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ, ఈసీఐఎల్లో గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న వారిని వెంటనే శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పట్ల యాజమాన్యం, బోర్డు చిన్న చూపు చూడడం తగదని హెచ్చరించారు. ఇటీవల 45 పోస్టులకు కొత్తగా నియమక నోటిఫికేషన్ జారీ చేసిందనీ ఈ నియమకల్లో స్థానికులకు ప్రాధాన్యత కల్పించడంతో పాటు తెలుగు భాషలో పరీక్షలు చేపట్టాలనీ, యాభైశాతం ప్రాక్టికల్స్, యాభైశాతం థీరిలో పరీక్షలు నిర్వహించి కాంట్రాక్టు కార్మికులకు వారి సీనియార్టీని గుర్తించి నియామకాలు చేపట్టాలన్నారు. తాజాగా రాష్ట్రంలో జరిగిన కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల



ఉద్యమాన్ని, గతంలో జరిగిన విద్యుత్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళనలను గుర్తు చేస్తూ, కార్మికుల సమస్యల పట్ల యాజమాన్య బోర్డు చిన్న చూపు చూడడం తగదన్నారు. 1967లో డా. ఎ.ఎస్. రావు ముంబైలో ఏర్పాటు చేయాల్సిన ఈసీఐఎల్ యూనిట్ను హైదరాబాద్కు తీసుకువచ్చి ఇక్కడి ప్రాంత ప్రజలకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశాన్ని గుర్తు చేశారు. ఈసీఐఎల్ చేపట్టిన 45 పోస్టుల రిక్రూట్మెంట్ పాలసీని నిరసిస్తూ ఆయన పలు డిమాండ్లు చేశారు. లేబర్ యాక్ట్ ప్రకారం గ్రూప్ సి, డి పోస్టులకు స్థానిక భాషలో పరీక్ష జరపాలని, స్థానిక ప్రాధాన్యత ఇవ్వాలని, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ను నిలిపివేయాన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ .సుధీర్ మాట్లాడుతూ ఈసీఐఎల్ చేపట్టిన 45 పోస్టుల టెక్నీషియన్, రిక్రూట్మెంట్ పాలసీని నిరసిస్తూ పలు డిమాండ్లు చేశారు. ఎన్నో సంవత్సరాలు కాంట్రాక్ట్ కార్మికులు గా పనిచేస్తున్న వారికి, డీఓపీటీ గైడ్లైన్స్ ప్రకారం ఇంటర్నల్ వైటేజ్ నీ ఇవ్వాలని, గ్రూప్ సి, డి పోస్టులకు రాత పరీక్ష హిందీ, ఇంగ్లీషు, తో పాటు రీజినల్ లాంగ్వేజ్ తెలుగు ను ఆప్షన్ గా పెట్టాలనీ, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ను నిలిపివేసి ఓఎమ్మార్ షీట్ విధానాన్ని అమలు చేయాలన్నారు. వెయిటేజ్ రాత పరీక్షలో థియరీకి ప్రాక్టికల్స్కు 50% మార్కులు కేటాయించాలని, హైదరాబాద్లో మాత్రమే ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటు చేయాల డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఆఫీస్ బేరర్స్ ఎస్. హనుమంతు, ఆర్. కేశయ్య, టి.గంగానాయక్ , కె. శారధ, శ్రీనివాస్, గంగాధరన్, రమేష్, కమలాకర్, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## కర్నాల్ పల్లిలో బడిబాట కార్యక్రమం



తెలంగాణ వీణ /చేగుంట



మెదక్ జిల్లా, చేగుంట మండలం ప్రాథమిక పాఠశాల కర్నాల్ పల్లి లో ఈరోజు బడిబాట గ్రామసభ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టబోయిన సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల ఇంటి వద్దనే పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలను కల్పిస్తుందని ఉచిత పాఠ్య పుస్తకాలను, నోటు పుస్తకాలను వర్కు బుక్కులను అందిస్తుందని, గ్రంథాలయ పుస్తక పఠనం, రెండు జతల ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజన పథకం వారానికి మూడుసార్లు గుడ్లు రాగి జావా ఇస్తూ పోషకాహారాన్ని అందిస్తుందని, త్రాగునీటి వసతి, టాయిలెట్స్,విశాలమైన మైదానం అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే మెరుగైన విద్యా బోధన ఉన్నాయని ఇలా ప్రభుత్వము విద్యార్థుల చదువుకోసము ఎన్నో సౌకర్యాలను కల్పిస్తుందని వాటిని వినియోగించుకొని ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు, గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఉపాధ్యాయుడు బాలచందర్ సార్ గారు మాట్లాడుతూ మన గ్రామంలో ఉన్న పాఠశాలలో మీ పిల్లలను చదివించి మన పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఆ తర్వాత గ్రామంలో తిరుగుతూ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కాప్రా ఈద్గాలో బక్రీద్ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే...

తెలంగాణవీణ,కాప్రా...



కాప్రా డివిజన్ పరిధిలోని ఈద్గాలో రూ. 11 లక్షల రూపాయల నిధులతో ఫ్లోరింగ్ పనులను పూర్తి కావడంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపు బక్రీద్ పండుగ సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందనీ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి , ఈద్గా కమిటీ అధ్యక్షుడు మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు బద్రుద్దిన్, పార్టీ నాయకులు నవీన్ గౌడ్, మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ , కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డి ,మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి , పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

-ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి

తెలంగాణవీణ, కాప్రా :



వన్ డే వన్ వార్డు కార్యక్రమంలో భాగంగా దోమల నిర్మూలన కోసం ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవరెడ్డి సూచించారు. శుక్రవారం చర్లపల్లి డివిజన్ వివిఎన్ రెడ్డి నగర్ కాలనీలో దోమల నివారణ కార్యాచరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎంటమాలజీ విభాగాల కార్మికులకు పలు సూచనలు చేసారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దోమల నిర్మూలన మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఈ నూతన కార్యాచరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి బండారి లక్ష్మా రెడ్డి, మాధవ రెడ్డి, బొంతు శ్రీదేవి, ఎంటమాలజీ ఏఈ డి. రమేష్ లు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా వియన్ రెడ్డి నగర్ లోని పలు ఇండ్లలో నీటి నిల్వలను పరిశీలించి సేకరించిన లార్వా పై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. లార్వా ద్వారా అభివృద్ధి చెందే దోమ వల్ల డెంగ్యూ, మలేరియా వ్యాపిస్తాయని, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్ వైజర్లు నరేందర్ రెడ్డి, పరమేష్, కనక రాజు, నరసింహ గౌడ్, ఏఎంసి డైరెక్టర్ నాగిళ్ల బాల్ రెడ్డి, బత్తుల శ్రీకాంత్ యాదవ్, బాల్ నరసింహ, క్రాంతి, నీరజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తికి,త్యాగానికి సహనానికి ప్రతీక 'బక్రీద్'

-ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరసోదరీమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

-ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

తెలంగాణవీణ, కాప్రా...



భక్తికి, త్యాగానికి, సహనానికి బక్రీద్ పండుగ ప్రతీక అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదర సోదరీ మణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని సూచించారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారని అన్నారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే బక్రీద్ ఇచ్చే సందేశమన్నారు. అల్లా ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు

## భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే...



తెలంగాణవీణ,కాప్రా...
మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లోని తిరుమలనగర్ కాలనీలో రూ. 18.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, ఉప్పల్ నియోజకవర్గం యొక్క అభివృద్ధికి పూర్తీ స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం సతీష్, ఏఈ వేణుగోపాల్, కాలనీ ప్రెసిడెంట్ మల్లేష్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అమరేంద్ర బాబు, కోశాధికారి బీడీ దాస్, ఆర్గనైజర్ సెక్రెటరీ మురళీకృష్ణ, కృష్ణమోహన్, కర్ణాకర్, ముత్యం వెంకన్న, జైపాల్ నాయుడు, శేఖర్, ప్రసాద్, షేక్ లాల్, నాగేశ్వర రావు, సత్యనారాయణ, శివాజీ, శ్రీధర్, రామచందర్, మురళీ, సత్యనారాయణ, ఆంజనేయులు, రామరావు, దేవన్, హరినాథ్ రెడ్డి, చారి, అమర్నాథ్ రెడ్డి, మరియు బీఆర్ఎస్ నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, ఉల్లెం బాలరాజు, గుమ్మడి జంపాల్ రెడ్డి, సతీష్ రెడ్డి, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## చర్లపల్లి రైల్వే స్టేషన్ను సందర్శించిన ఎమ్మెల్యే ....



తెలంగాణవీణ, కాప్రా
చర్లపల్లి రైల్వే స్టేషన్ ను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైల్వే టెర్మినల్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన రోడ్లు, పార్కింగ్, వ్యాపార సముదాయాలపై అధికారులతో చర్చించారు.ప్రస్తుతం స్టేషన్లో సరైన వసతులు లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ దీపాలు లేకపోవడం వల్ల రాత్రి సమయాల్లో చుట్టుపక్కల వారికి కూడా అసౌకర్యం కలుగుతోందన్నారు . వెంటనే చర్లపల్లి రైల్వే స్టేషన్ మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని, ఇటీవల గాలివానకు దెబ్బతిన్న స్టేషన్కు జరుగుతున్న మరమ్మతు పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేగుంట మండల ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన

చేగుంట మాజీ ఎంపీపీ,మాసుల శ్రీనివాస్.

తెలంగాణ వీణ,చేగుంట...



భక్తికి,త్యాగానికి,సహనానికి ప్రతీక 'బక్రీద్' ముస్లిం సోదరసోదరీ మణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన లిచేగుంట మాజీ ఎంపీపీ, మాసుల శ్రీనివాస్. భక్తికి, త్యాగానికి,సహనానికి బక్రీద్ పండుగ ప్రతీక అని చేగుంట మాజీ ఎంపీపీ,మాసుల శ్రీనివాస్ పేర్కొన్నారు.బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరసోదరీ మణులకు చేగుంట మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.భక్తి,శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్ సూచించారు.దైవ ప్రవక్త ఇబ్రహీంమహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారని చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్ చెప్పారు.పేదల పట్ల జాలి,దయ కలిగి ఉండటమే బక్రీద్ ఇచ్చే సందేశమన్నారు.అల్లాహ్ ఆశీస్సులు చేగుంట మండల ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని చేగుంట మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ ఆకాంక్షించారు.

# స్వయం సమృద్ధి భారత్ కోసం మోడీ కృషి

**–బీజేపి జిల్లా కౌన్సిల్ మెంబర్ పల్లె కుమార్ యాదవ్.**



**తెలంగాణవీణ,తొర్రూరు...**
భారతదేశంలో పేదరికం నిర్మూలించడం బిజెపి ప్రభుత్వ లక్ష్యమని.. స్వయం సమృద్ధి భారత్ కోసం మోడీ ఎనలేని కృషి చేస్తున్నారని బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ పల్లె కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో తొర్రూరు పట్టణంలో స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫంక్షన్ లో 11ఏళ్ళ మోడీ పాలన సంకల్పంతో సాకారం మండల కార్యశాల తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ సభాధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి పల్లె కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత దశాబ్దం కాలంలో ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాలను మార్చివేసిందని, 25కోట్ల మందిని పేదరికం నుంచి బయట పడేసిందని, వారు స్వయం సమృద్ధి సాధించేందుకు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని, ప్రతీ ఒక్క భారతీయుడు గౌరవంగా జీవించడానికి వీలుగా సమ్మిళిత, స్వయం సమృద్ధి భారత్ కోసం మోడీ అనునిత్యం క్రృషి చేస్తున్నారని తెలిపారు. ప్రధాని ఆవాస్ యోజన పథకం కింద 4కోట్ల మందికి పక్కా ఇండ్లు, ఉజ్వల యోజన పథకం కింద 10కోట్ల మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు, స్వచ్ఛ భారత్ కోసం 12కోట్ల మందికి మరుగుదొడ్ల నిర్మాణం, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా అందరికీ ఉచిత వైద్యం,జన్ ధన్ అకౌంట్ ద్వారా అందరికీ బ్యాంకు ఖాతాలు, ఏడాదికి లక్ష కోట్లు ఖర్చు పెట్టి ధేశం మొత్తం జాతీయ రహదారుల నిర్మాణం, ధేశ వ్యాప్తంగా 81కోట్ల మందికి ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున ఉచిత రేషన్ బియ్యం మరియు గోధుమల పంపిణీ వంటి అనేక సంక్షేమ పథకాలు గ్రామాల్లో, పట్టణాల్లో వసతుల కల్పన తో 25కోట్ల మందికి పైగా పేదరికం నుంచి బయట పడ్డారని, 11ఏళ్ళ మోడీ పాలన అమృత పాలన అని,మరోవైపు ధేశ సరిహద్దు- భద్రత వంటి అంశాల్లో మోదీ గారు తీసుకున్న సంచలన నిర్ణయాలు, సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ విజయం ప్రపంచ వ్యాప్తంగా భారత్ సత్తా చాటిన పలు అంశాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి ప్రజల్లో బీజేపీ పార్టీ పట్ల ఉన్న సానుకూల స్పందనను బీజేపీ శ్రేణులు క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమై రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేందుకు క్రృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా, మండల, వివిధ మోర్చాల బాధ్యులు, మండల ఉపాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు మరియు మండల పదాదికారులు మంగళపల్లి యాకయ్య, ఆర్. రాజ్ కుమార్, గడ్డల శేఖర్, సిహెచ్.విజయ్ కుమార్, గట్ల భరత్, గంధం రాజు, పప్పు శెట్టి సంతోష్, నడిగడ్డ సందీప్, నూకల నవీన్, శీలం శ్రీనాథ్, తూర్పాటి సాయి ముకేష్, ధరావత్ తేజస్, సర్వి వెంకటేష్, నర్కుటి శివ గణేష్, సిహెచ్.శ్రీనివాస్, టి.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయనగర్ బస్తీ సంక్షేమ సంఘు ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ప్రముఖులు



**తెలంగాణవీణ,కాప్రా...**
కాప్రా సర్కిల్ మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని నవోదయనగర్ బస్తీలో నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘ అధ్యక్ష కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా సింగపాక లింగం, ఉపాధ్యక్షులుగా గొట్టే పోచయ్య, ప్రధాన కార్యదర్శి వేల్పుల రాములు, సహాయ కార్యదర్శి కుందేళ్ళ రాము, కోశాధికారి వేల్పుల అనోక్ (విజయ్), సహాయ కోశాధికారి ముక్క శ్రీనివాస్, ఆర్గనైజర్స్ పులుగు బాలరాజు, మానేపల్లి లక్ష్మణ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా చంద్రమౌళి, ముక్క గిరి, గొల్లూరి ప్రసాద్, పాకాల నరసింహ, చేవెళ్ల శేఖర్, పరిశరాములు, ఉప్పలపల్లి నర్సయ్య, దేవయ్య, శ్రీను, కృష్ణ, కనకయ్య, సిద్ధులు, వెంకటేష్, గణేష్, బోయిని సిద్ధులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, గుమ్మడి జంపాల్ రెడ్డి, భూపతి అశోక్, కొయ్యడ జయపాల్, హరినాథ్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, తాళ్ళపల్లి లింగం, నవీన్, ఆనంద్, భూపాల్ గౌడ్, బాలరాజు, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ తో పాటు బస్తీవాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన కార్యవర్గం బస్తీ అభివృద్ధికి కృషి చేయాలని వక్తలు ఆకాంక్షించారు.

# ఈసీఐఎల్ మజ్దూర్ సంఘ్ డిమాండ్లకు బీజేపీ మద్దతు..

**తెలంగాణవీణ,కాప్రా...**
ఈసీఐఎల్ లో కంపెనీలో గ్రూప్ సీ, డీ ఉద్యోగ నియమాకల్లో స్థానికులు తగిన ప్రాధాన్యత కల్పించాలని ఈఇసీఐఎల్ మజ్దూర్ సంఘ్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఈసీఐఎల్ మజ్దూర్ యూనియన్ కార్యాయలంలో టెక్నీషియన్ రిక్రూట్మెంట్ పై నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ, ఈసీఐఎల్‌లో గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న వారిని వెంటనే శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పట్ల యాజమాన్య%శీ%, బోర్డు చిన్న చూపు చూడడం తగదని హెచ్చరించారు. ఇటీవల 45 పోస్టులకు కొత్తగా నియమక నోటిఫికేషన్ జారీ చేసిందనీ ఈ నియమకల్లో స్థానికులకు ప్రాధాన్యత కల్పించడంతో పాటు తెలుగు భాషలో పరీక్షలు చేపట్టాలనీ, యాభైశాతం ప్రాక్టికల్స్, యాభైశాతం థీరిలో పరీక్షలు నిర్వహించి కాంట్రాక్టు కార్మికులకు వారి సీనియార్టీని



గుర్తించి నియామాకాలు చేపట్టాలన్నారు. తాజాగా రాష్ట్రంలో జరిగిన కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల ఉద్యమాన్ని, గతంలో జరిగిన విద్యుత్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళనలను గుర్తు చేస్తూ, కార్మికుల సమస్యల పట్ల యాజమాన్య బోర్డు చిన్న చూపు చూడడం తగదన్నారు. 1967లో డా. ఎ.ఎస్. రావు ముంబైలో ఏర్పాటు చేయాల్సిన ఈసీఐఎల్ యూనిట్‌ను హైదరాబాద్‌కు తీసుకువచ్చి ఇక్కడి ప్రాంత ప్రజలకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశాన్ని గుర్తు చేశారు. ఈసీఐఎల్ చేపట్టిన 45 పోస్టుల రిక్రూట్‌మెంట్ పాలసీని నిరసిస్తూ ఆయన పలు డిమాండ్లు చేశారు. లేబర్ యాక్ట్ ప్రకారం గ్రూప్ సి, డి పోస్టులకు స్థానిక భాషలో పరీక్ష జరపాలని, స్థానిక ప్రాధాన్యత ఇవ్వాలని, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌ను నిలిపివేయాన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ .సుధీర్ మాట్లాడుతూ ఈసీఐఎల్ చేపట్టిన 45 పోస్టుల టెక్నీషియన్, రిక్రూట్‌మెంట్ పాలసీని నిరసిస్తూ పలు డిమాండ్లు చేశారు. ఎన్నో సంవత్సరాలు కాంట్రాక్ట్ కార్మికులు గా పనిచేస్తున్న వారికి, డీఓపీటీ గైడ్లైన్స్ ప్రకారం ఇంటర్నల్ వైటేజ్ నీ ఇవ్వాలని, గ్రూప్ సి, డి పోస్టులకు రాత పరీక్ష హిందీ, ఇంగ్లీషు, తో పాటు రీజినల్ లాంగ్వేజ్ తెలుగు ను ఆప్షన్ గా పెట్టాలనీ, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌ను నిలిపివేసి ఓఎమ్మార్ షీట్ విధానాన్ని అమలు చేయాలన్నారు. వెయిటేజ్ రాత పరీక్షలో థియరీకి ప్రాక్టికల్స్‌కు 50% మార్కులు కేటాయించాలని, హైదరాబాద్‌లో మాత్రమే ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటు చేయాల డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఆఫీస్ బేరర్స్ ఎస్. హనుమంతు, ఆర్. కేశయ్య, టి.గంగానాయక్ , కె. శారధ, శ్రీనివాస్, గంగాధరన్, రమేష్, కమలాకర్, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## పోలంపల్లి లో బడిబాట గ్రామ సభ ఏర్పాటు

**మీ పిల్లల భవిష్యత్తు మీ చేత్తులో**

**హెడ్మాస్టర్, శ్రీనివాస్**





**తెలంగాణ వీణ/ చేగుంట...**
మెదక్ జిల్లా, చేగుంట మండలం పోలంపల్లి గ్రామంలో శుక్రవారం నాడు బడిబాట కార్యక్రమంలో భాగంగా పోలంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరినీ, బడిలో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలను సంరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని అందరూ కచ్చితంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బడిబాట అనేది పిల్లలకు విద్యను అందుబాటులోకి తీసుకురావడం ప్రధాన లక్ష్యం, పిల్లలను ఇంటిలో నుంచి పాఠశాలకు తీసుకురావడం పాఠశాలలో పిల్లలకు చదువుతోపాటు, మంచి భోజనం, కూడా ప్రభుత్వమే, ఇవ్వనుంది మీ పిల్లల భవిష్యత్తు మీ చేతిలో ఉంది కాబట్టి, పిల్లలందరినీ ప్రభుత్వ బడులలో చేర్పించాలని, వారు కోరారు, ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్రవంతి ఉపాధ్యాయులు సంతోష్ రాణి, అంగన్వాడి టీచర్ మమత, గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ కొండి మల్లేశం, పులిమామిడి రాజు, ఐలయ్య, యాదగిరి, దశరథ, బాలకృష్ణ, స్వామి, జి సత్తయ్య, సత్యం, కొమరయ్య, సత్తయ్య, దుర్గమ్మ, భారతి, దేవమ్మ, లక్ష్మీ, చిన్న లక్ష్మి, శ్యామమ్మ, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం కమీషన్ రిపోర్ట్ త్వరగా బయటపెట్టాలి..

# బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి

**–రాజకీయపబ్బం గడపవద్దని కాంగ్రెస్ ను హెచ్చరిస్తున్నా: ఎంపీ**
**–ఈటల రాజేందర్,**



**తెలంగాణవీణ,హైదరాబాద్...**
ఏ పార్టీలో ఉన్నా నేను విలువలతో కూడిన రాజకీయ నాయకునిగా కొనసాగుతున్న. 16,500 కోట్లతో తుమ్మిడిహట్టి - చేవెళ్ల ప్రాజెక్ట్ నిర్మాణం తలపెట్టారు.మళ్ళీ దానిని 38 వేల కోట్లకు పెంచారు. 152 మీటర్లు బ్యారేజి ప్రపోజల్స్ ఉంటే మహారాష్ట్ర అభ్యంతరాలతో 148 మీటర్లు తగ్గించింది. దీనివల్ల మనకు సరిపోయెన్ని నీళ్లు రావని.. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం హరీష్, తుమ్మల నన్ను కలిపి మంత్రివర్గ ఉపసంఘం వేసారు. టెక్నికల్ టీమ్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాలని చెప్పారు. 63 వేల కోట్లు ఖర్చు అవుతుంది అన్నారు అది 82 వేల కోట్లకు వెళ్లింది తరువాత ఎంత పెరిగిందో నాకు అవగాహన లేదు. డిజైన్స్, కన్స్ట్రక్షన్ తో సంబంధం ఉందా అని అడిగారు.. ఫైనాన్స్ డిపార్ట్మెంట్ కి సంబంధం లేదు అని చెప్పాను.కార్పొరేషన్ రుణాల మీద అజమాయిషీ ఉందా అని అడిగారు..లేదు అని చెప్పాను. ఇరిగేషన్ డిపార్ట్ లోనే అకౌంట్ ఆడిట్ డిపార్ట్మెంట్ లు పనులు, నాణ్యత చెల్లిపులు వారే చేసుకున్నారు తప్ప ఫైనాన్స్ డిపార్ట్మెంట్ కి సంబంధం లేదు.మా బ్రతుకు ట్రసపరెంట్ గా ఉన్నాయి.కణత మీద తుపాకీ పెట్టిన విలువలు పోగొట్టుకోము.పిచ్చి కూతలు బంద్ పెట్టండి.మీరెన్ని ఆరోపణలు చేసినా ప్రజలు నిజమైన న్యాయ నిర్ణేతలు.బట్టకాల్చి మీద వేయడం మానేయండి.కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా.. బీజేపీ చట్టాన్ని న్యాయాన్ని గౌరవించే పార్టీ. కమీషన్ రిపోర్ట్ త్వరగా బయటపెట్టి నిజమైన దోషులను బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్న. రాజకీయ పబ్బం గడిపితే ఊరుకోము. రిపోర్ట్ బయట పెట్టు.శిక్షించక పోతే నీ కు శిక్ష తప్పదు.కెసిఆర్ వందల సార్లు కాళేశ్వరం సృష్టికర్త నేనే అని చెప్పుకున్నారు. కెసిఆర్ నిర్ణయం తీసుకున్నారు. దానిని క్యాబినెట్ తో ఆమోదింపజేశారు. ఫైనాన్స్ డిపార్ట్మెంట్ కి సంబధం. ఘోష్ రిపోర్ట్ బయటపెట్టి దోషులను శిక్షించండి.

## ముగిసిన వేసవి ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరం

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి**

**తెలంగాణవీణ,మిర్యాలగూడ ...**
మిర్యాలగూడ చింతపల్లి ఇందిరమ్మ కాలనీ లో మే నెల నుంచి జూన్ 6తారీకు వరకు సమ్మర్ వాలీబాల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. డి వై ఎస్ ఓ ఆధ్వర్యంలో వేసవిలో క్రీడల పట్ల మరియు మానసిక ఉల్లాసాన్ని కల్పించడానికి మన ఇంద్రమ్మ కాలనీ లో వాలీబాల్ 30 మంది క్రీడాకారులకి నేర్పియడం జరిగింది. క్రీడాకారులకు ఉల్లాసం కల్పించడానికి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి పాల్గొని సహాయ సహకారాలు అందించారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు క్రీడాకారులు గ్రామ పెద్దలు జరావర్ సింగ్, హుజూర్ సింగ్, జోర్ సింగ్, గ్రౌండ్ ఇంచార్జ్ బాబర్ సింగ్, వాలీబాల్ కోచ్ జస్రత్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## స్టన్నింగ్ ఫీచర్స్‌తో ఆ హ్యూందాయ్ కారు నయా వెర్షన్..

### ధర ఎంతో తెలిస్తే షాక్-



**తెలంగాణవీణ, బిజినెస్**
హ్యూందాయ్ కొత్త ఎస్ఎక్స్ ప్లస్ వేరియంట్ రిలీజ్ చేయడం ద్వారా వెర్నా సెడాన్ శ్రేణిని విస్తరించిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కొత్త వేరియంట్ ధర రూ. 13.79 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. ఈ కారు 115 హెచ్‌పీ, 144 ఎన్ఎం టార్క్ ను ఉత్పత్తి చేసే 1.5 లీటర్ పెట్రోల్ మోటారుతో మాత్రమే అందుబాటులో ఉంటుంది. ట్రాన్స్మిషన్ ఎంపికలలో ఎంటీ, ఐవీటీ రెండూ ఉన్నాయి. ఐవీటీ వెర్షన్ ధర రూ. 15.04 లక్షల వరకు ఉంటుంది. వెర్నా ఎస్ఎక్స్ం కారులో వెంటిలేటెడ్, హీటెడ్ ఫ్రంట్ సీట్లు, లెథరెట్ అలరీ, 8-స్పీకర్ బోస్ సౌండ్ సిస్టమ్, ఫ్రంట్ పార్కింగ్ సెన్సార్లు ఉన్నాయి. ఎక్స్టీరియర్ విషయానికి వస్తే ఎల్ఈడీ హెడ్ ల్యాంప్లు ఆకట్టుకుంటున్నాయి. ఎస్ఎక్స్ ప్లస్ ట్రిమ్ ఇంటీరియర్‌లో 8.0-అంగుళాల ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్, డిజిటల్ డ్రైవర్ డిస్ప్లే వంటి లక్షణాలు ఆకట్టుకుంటాయి. ఈ సిస్టమ్ వైర్లెస్ ఆపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటోలకు సపోర్ట్ చేస్తుంది. మైలేజ్ విషయానికి మాన్యువల్ వేరియంట్ 18.6 కిలోమీటర్లు మైలేజ్ ఇస్తుంది. అయితే ఐవీటీ వేరియంట్ 19.6 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది. కొత్త వెర్నా వేరియంట్‌తో పాటు హ్యూందాయ్ వైర్డ్-టు-వైర్లెస్ అడాప్టర్ అనే కొత్త యాక్సెసరీని కూడా విడుదల చేసింది. ఈ అడాప్టర్ ధర రూ. 4,500. అలాగే వెర్నా, గ్రాండ్ ఐ10 నియోస్, ఎకర్, ఆరా, వెన్యూ, వెన్యూ ఎన్ లైన్, అల్కాజార్ వంటి అనేక మోడళ్లకు వైర్లెస్ ఆపిల్ కార్ ప్లే మరియు ఆండ్రాయిడ్ ఆటో ప్లేను అనుమతిస్తుంది. అలాగే మే 2025లో మొత్తం 58,701 హ్యూందాయ్ యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దేశీయ మార్కెట్ 43,861 యూనిట్లు అమ్ముడైతే విదేశీ మార్కెట్లకు 14,840 యూనిట్లు రవాణా చేశారు.

## అమ్మకాల్లో మూడో స్థానానికి పడిపోయిన ఓలా..

### దూసుకుపోతున్న టీవీఎస్



**తెలంగాణవీణ, బిజినెస్**
దేశంలో ఈవీ స్కూటర్ల అమ్మకాల్లో టీవీఎస్ కొత్త రికార్డులను సృష్టించింది. ఈ కంపెనీ వరుసగా రెండోసారి ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాల్లో అగ్రస్థానంలో నిలిచింది. టీవీఎస్‌కు చెందిన ఐక్యూబ్‌కు మార్కెట్లో బలమైన డిమాండ్ ఉంది. ఈ స్కూటర్ హెూసూర్‌కు చెందిన ఓలా వంటి ఇతర బ్రాండ్లను కంటే అమ్మకాల్లో అగ్రస్థానంలో ఉంది. మే 2025లో దేశంలో ఈవీ స్కూటర్ల అమ్మకాలను పరిశీలిస్తే అత్యధికంగా అమ్ముడైన ఎలక్ట్రిక్ స్కూటర్లలో టీవీఎస్ తన స్థానాన్ని నిలుపుకుందని నిపుణులు చెబుతన్నారు. టీవీఎస్ మే 2025లో 24,560 యూనిట్లను అమ్మింది. టీవీఎస్ దాని ఈవీ పోర్ట్‌ఫోలియోలో రెండు ఎలక్ట్రిక్ స్కూటర్‌లను ఐక్యూబ్, ఐక్యూబ్ ఎక్స్ అందుబాటులో ఉంచింది. టీవీఎస్ కొన్ని రోజుల క్రితం అమ్మకాలను పెంచుకునేందుకు ప్రత్యేక ఆఫర్లను కూడా ప్రకటించింది. ఈవీ స్కూటర్ల అమ్మకాల్లో రెండవ స్థానంలో బజాజ్ చేతక్ ఉంది. మే 2025లో బజాజ్ చేతక్ యొక్క 21,770 యూనిట్లను విక్రయించింది, ఓలా ఎలక్ట్రిక్‌ను అధిగమించింది. ఓలా మే 2025లో మూడో స్థానానికి పడిపోయింది. ఓలా 18,499 యూనిట్లను విక్రయించింది. ఓలా ఎస్1 శ్రేణి తిరిగి పుంజుకున్నా, ధర తక్కువగా ఉన్నా అమ్మకాల్లో మాత్రం మూడో స్థానానికి చేరింది. మే 2025లో 12,840 యూనిట్ల అమ్మకాలతో ఏథర్ ఎనర్జీ నాల్గవ స్థానంలో నిలిచింది. గత ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించిన రిజ్టా అమ్మకాల సంఖ్య 1 లక్షను అధిగమించింది. మే 2025కి 7,164 యూనిట్లను విక్రయించి హీరో టాప్ ఐదు ఎలక్ట్రిక్ స్కూటర్ అమ్మకాల్లో తన చోటును పదిలం చేసుకుంది. హీరో విడా కూడా ఇటీవలే రిఫ్రెష్ అయ్యింది. అలాగే మే 2025 అమ్మకాలతో విడా బ్రాండ్ వాహన్ మార్కెట్ వాటా 7.2% కలిగి ఉంది.

## ఆగిన స్విఫ్ట్ కార్ల ఉత్పత్తి

### అరుదైన ఖనిజాల ఎగుమతిపై చైనా ఆంక్షల నేపథ్యంలో సుజుకీ నిర్ణయం



**తెలంగాణవీణ, బిజినెస్**
సుజుకీ మోటర్ జపాన్‌లో తమ ప్రతిష్ఠాత్మక మోడల్ స్విఫ్ట్ కార్ల ఉత్పత్తిని ఆపేసింది. అరుదైన ఖనిజాల ఎగుమతిపై చైనా ఆంక్షల నేపథ్యంలోనే సుజుకీ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. దీంతో చైనా చర్యలతో ప్రభావితమైన తొలి జపాన్ ఆటో రంగ సంస్థగా సుజుకీ నిలిచింది. కొన్ని విడిభాగాల కొరతతో గత నెల మే 26 నుంచి స్విఫ్ట్ స్పోర్ట్ వెర్షన్ మినహా మిగతా అన్ని రకాల స్విఫ్ట్ కార్ల ఉత్పత్తిని సుజుకీ మోటర్ నిలిపేసింది. ఉత్పత్తిని తిరిగి ప్రారంభించే పనిలోపడ్డ సుజుకీ.. ఈ నెల 13 నుంచి పాక్షికంగా, 16 నుంచి పూర్తిస్థాయిలో మొదలవుతుందన్న ఆశాభావాన్ని ఓ ప్రకటనలో వ్యక్తం చేసింది. అయితే ఉత్పత్తిని ఆపేయడానికి గల కారణాలను మాత్రం ఈ సందర్భంగా సంస్థ తెలియపర్చలేదు.

**ట్రేడ్ వార్ ఎఫెక్ట్**
అమెరికాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో చైనా తమ దేశం నుంచి జరుగుతున్న అరుదైన ఖనిజాల ఎగుమతుల్ని నిషేధించింది. దీంతో ఆటో రంగ సంస్థలు, ఏరోస్పేస్ తయారీదారులు, సెమీకండక్టర్ ఉత్పాదక కంపెనీలు, మిలిటరీ కాంట్రాక్టర్లకు గట్టి దెబ్బ తగిలినట్టైంది. సెమీకండక్టర్లు, మరికొన్ని ముఖ్యమైన విడిభాగాల తయారీలో ఉపయోగించే అరుదైన ఖనిజాల నిల్వలు చైనాలోనే ఎక్కువగా ఉన్నాయి. అమెరికాలో ఉన్నప్పటికీ అవి ఆ దేశ మిలిటరీ ఇతర కీలక రంగాల అవసరాలకే వినియోగిస్తున్నారు. దీంతో కార్పొరేట్ల ఒత్తిళ్ల నడుమ అమెరికాతో ఆయా దేశాలు సంప్రదింపులకు దిగుతున్నాయిప్పుడు.

**భారత్‌పై ప్రభావం లేదు**
జపాన్‌లో స్విఫ్ట్ కార్ల ఉత్పత్తిని సుజుకీ మోటర్ ఆపేసినా.. భారత్‌లో ఆ ప్రభావమేమీ ఉండబోదని దాని అనుబంధ సంస్థ మారుతీ సుజుకీ చెప్తున్నది. దేశంలో స్విఫ్ట్ కార్ల తయారీ యథాతథంగా జరుగుతూనే ఉందని ఓ మీడియా ప్రశ్నకు మారుతీ సుజుకీ కార్పొరేట్ అఫైర్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్ భారతీ స్పష్టం చేశారు.

## రిటైర్‌మెంట్ ప్రకటించిన ఐపీఎల్ లెజెండ్.. ధోనీనే వణికించినోడు!

**తెలంగాణవీణ, క్రీడలు :**
టీమిండియా వెటరన్ స్పిన్నర్ పీయుష్ చావ్లా సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు 36 ఏళ్ల ఈ లెగ్ స్పిన్నర్ ప్రకటించాడు. టీ20 ప్రపంచ కప్-2007, వన్డే వరల్డ్ కప్-2011ను గెలుచుకున్న భారత జట్టులో సభ్యుడిగా ఉన్న పీయుష్.. క్రికెట్ నుంచి వైదొలుగుతున్నట్లు వెల్లడించాడు. సుదీర్ఘ కెరీర్‌లో తన సక్సెస్‌కు సహకరించిన వారందరికీ అతడు ధన్యవాదాలు తెలిపాడు. అందమైన ఆటకు వీడ్కోలు పలికేందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నట్లు చెప్పాడు పీయుష్. రిటైర్‌మెంట్ ఇచ్చినా తన నుంచి క్రికెట్‌ను వేరు చేయలేరని అన్నాడు. టీమిండియాకు ఆడిన ప్రతి క్షణాన్ని ఆస్వాదించానని.. వరల్డ్ కప్ జ్ఞాపకాలు ఎప్పటికీ మర్చిపోనని పేర్కొన్నాడు. తనపై నమ్మకం ఉంచి ప్రోత్సహించిన ఐపీఎల్ ఫ్రాంచైజీలు పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్‌కు అతడు థ్యాంక్స్ చెప్పాడు.



**దేశవాళీల్లోనూ దిగ్గజమే..**
ఇన్నాళ్ల కెరీర్‌లో తనకు సహకరించిన కుటుంబ సభ్యులు, కోచింగ్ స్టాఫ్‌తో పాటు మద్దతుగా నిలిచిన ఫ్యాన్స్‌కు ధన్యవాదాలు తెలిపాడు పీయుష్ చావ్లా. క్రికెట్ జర్నీలో అండగా ఉన్న భారత క్రికెట్ బోర్డుతో పాటు ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్ క్రికెట్ అసోసియేషన్స్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్‌లో కృతజ్ఞతలు తెలియజేశాడు. కాగా, ఐపీఎల్ లెజెండ్‌గా గుర్తింపు సంపాదించిన చావ్లా.. ఓవరాల్‌గా క్యాష్ రిచ్ లీగ్‌లో 164 మ్యాచుల్లో 156 వికెట్లు పడగొట్టాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఓ మ్యాచ్‌లో బంతిని గింగిరాలు తిప్పుతూ ఎంఎస్ ధోనీని భయపెట్టాడు. ఇక, భారత జట్టు తరఫున 2006లో అరంగేట్రం చేసిన చావ్లా.. ఇంగ్లండ్‌తో 2012లో జరిగిన నాగ్‌పూర్ టెస్ట్‌లో చివరగా ఆడాడు. మొత్తంగా భారత్ తరఫున 3 టెస్టుల్లో 7 వికెట్లు తీశాడు. 25 వన్డేల్లో 32 వికెట్లు, 7 టీ20ల్లో 4 వికెట్లు పడగొట్టాడతను. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 446 వికెట్లు, లిస్ట్-ఏలో 254 వికెట్లు పడగొట్టాడు చావ్లా.

## రాణించిన రాహుల్

### మెరిసిన కరుణ్, జురెల్

### భారత్-ఏ తొలి ఇన్నింగ్స్ 213/3

**తెలంగాణవీణ, క్రీడలు :**
ఇంగ్లీశ్ గడ్డపై మంచి రికార్డున్న వికెట్ కీపర్, బ్యాటర్ కెఎల్ రాహుల్ ఇంగ్లాండ్ లయన్స్‌తో భారత్-ఏ రెండో అనధికార టెస్టులో కదం తొక్కాడు. అజేయ అర్ధ సెంచరీ సాధించిన కెఎల్ రాహుల్ భారత్‌ను భారీ స్కోరు దిశగా నడిపించాడు. టాస్ నెగ్గిన ఇంగ్లాండ్ లయన్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (17, 26 బంతుల్లో 2 ఫోర్లు) క్రిస్ వోక్స్ ఓవర్లో ఎల్బీడబ్ల్యూగా నిష్క్రమించాడు. దీంతో 28 పరుగులకే భారత్-ఏ తొలి వికెట్ కోల్పోయింది. మరో ఓపెనర్ కెఎల్ రాహుల్ (93 నాటౌట్, 143 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధ సెంచరీతో మెరిశాడు. వర్షం, తడి అవుట్‌ఫీల్డ్‌తో ఆటకు అంతరాయం కలిగినా రాహుల్ ఏకాగ్రత కోల్పోలేదు. ఆరు ఫోర్లతో 102 బంతుల్లో



అర్ధ సెంచరీ సాధించిన రాహుల్.. సెంచరీ దిశగా సాగుతున్నాడు. తొలి మ్యాచ్‌లో మెరిసిన కరుణ్ నాయర్ (40, 71 బంతుల్లో 4 ఫోర్లు) ఆకట్టుకునే ఇన్నింగ్స్ నమోదు చేశాడు. కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (11, 13 బంతుల్లో 2 ఫోర్లు) ఇన్నింగ్స్‌ను ధాటిగా మొదలెట్టినా.. వికెట్ నిలుపుకోలేదు. వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (37 నాటౌట్, 60 బంతుల్లో 4 ఫోర్లు) నిలకడగా పరుగులు రాబట్టాడు. కెఎల్ రాహుల్, కరుణ్ నాయర్ నాల్గో వికెట్‌కు అజేయంగా 87 పరుగులు జోడించారు. తొలి రోజు ఆటలో టీ విరామ సమయానికి భారత్-ఏ 52 ఓవర్లలో 213/3 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ లయన్స్ బౌలర్లలో క్రిస్ వోక్స్ (3/30) మూడు వికెట్లతో విజృంభించాడు.

# స్పోర్ట్స్

## కోహ్లీని అరెస్ట్ చేయాలంటూ హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్




**తెలంగాణవీణ, క్రీడలు :**
బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద బుధవారం జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతిచెందడం యావత్ జాతిని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ దుర్ఘటనపై నెటిజన్లు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఈ తొక్కిసలాట ఘటన ఆర్‌సీబీ మెడకు చుట్టుకుంటోంది. ఇప్పటికే ఈ ఘటనపై ఆర్‌సీబీ, కర్ణాటక క్రికెట్ సంఘం, ఈవెంట్ మేనేజర్లపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో ఆర్‌సీబీ జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ (Virat Kohli) పేరు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. తొక్కిసలాటకు భాద్యుడిగా కోహ్లీని అరెస్ట్ చేయాలని సోషల్ మీడియాలో నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు #ArrestKohli ని నెటిజన్లు విపరీతంగా ట్రెండ్ చేస్తున్నారు.పుష్ప-2 స్క్రీనింగ్ సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. థియేటర్‌కు టాలీవుడ్ స్టార్ అల్లు అర్జున్ రావడంతోనే తొక్కిసలాట జరిగిందని, పోలీసులు వద్దని వారించినా ఆయన కారులో పరేడ్ నిర్వహించారని ఆరోపిస్తూ ఆ హీరోను అరెస్ట్ చేశారు. ఇప్పుడు కోహ్లీని చూడటానికే లక్షలాది మంది చిన్నస్వామి స్టేడియానికి వచ్చారని, ఈ క్రమంలోనే తొక్కిసలాట జరిగి 11 మంది మృతి చెందారని అల్లు అర్జున్ అభిమానులు అంటున్నారు. మరి, తమ హీరోను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్ట్ చేసినట్టే, ఇప్పుడు కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కోహ్లీని కూడా అరెస్ట్ చేస్తుందా..? అని కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. ఈ క్రమంలో #ArrestKohli ట్రెండింగ్‌లో కొనసాగుతోంది.



# హాలీవుడ్ పిలుస్తోందంటున్న దిశా పటానీ..

**తెలంగాణవీణ, సినిమా :**
కల్కి సినిమాలో హీరో భైరవ. అతని లవ్ ఇంట్రస్ట్ రాక్సీ. ఈ రోల్ చేసింది దిశా పాట్నీ. కథ పరంగా పెద్దగా ఇంపార్టెన్స్ లేదు. కొన్ని సీన్లు, ఓ సాంగ్‌కి మాత్రమే పరిమితమయ్యారు దిశా. అయినా సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో దిశతో డార్లింగ్ ఆడిపాడిన సాంగ్‌కి మంచి క్రేజ్ వచ్చింది.నెక్స్ట్ పార్ట్ 2లో వీరిద్దరి స్క్రీన్ ప్రెజెన్స్ ఇంకొంచెం ఎక్కువే ఉండొచ్చనే మాటలూ వినిపిస్తున్నాయి.కల్కి తర్వాత కంగువ మీద కూడా బిగ్ హోప్స్ పెట్టుకున్నారు దిశ. కానీ సూర్యతో నటించిన కంగువ ఈ అమ్మణికి కలిసి రాలేదు.సినిమా ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. కంగువ అనుకున్నంత సక్సెస్ అయి ఉంటే తప్పకుండా సీక్వెల్ ఉండేది. సౌత్‌లో దిశకు మరో ప్రాజెక్ట్ ఉండేది. కల్కి సీక్వెల్ స్టార్ట్ అయ్యేవరకు బాలీవుడ్ ప్రాజెక్టులతో బిజీ కావాలన్నది దిశ ప్లాన్.ప్రస్తుతం బాలీవుడ్‌లో వెల్కమ్ టు ద జంగిల్ చేస్తున్నారు దిశ. ఈ సినిమా తర్వాత మాత్రం మరే ప్రాజెక్టులకూ సైన్ చేయలేదు. సమ్‌థింగ్ బిగ్ అంటూ ఊరించారు.ఆ బిగ్ న్యూస్ ఇప్పుడు రివీల్ అయింది.బాలీవుడ్ బ్యూటీ దిశా పాట్నీ హాలీవుడ్ ఎంట్రీకి రెడీ అవుతున్నారు. ది యూజువల్ సస్పెక్ట్, హౌస్ ఆఫ్ కార్డ్స్ లాంటి సినిమాలతో ప్రూవ్ చేసుకున్న ఆస్కార్ విన్నర్ కెవిన్ స్పేసీ నెక్స్ట్ మూవీ లో కీలక పాత్రలో నటించబోతున్నారు దిశా. హోలీ గార్డ్స్ పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం 20 ఏళ్ల తరువాత మెగా ఫోన్ పడుతున్నారు కెవిన్.




# సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసిన శ్రీవిష్ణు 'సింగిల్'..

## స్ట్రీమింగ్ ఎక్కడంటే.!

**తెలంగాణవీణ, సినిమా :**
టాలీవుడ్ యువ కథానాయకుడు శ్రీవిష్ణు హీరోగా నటించిన కామెడీ ఎంటర్‌టైనర్ సింగిల్() చిత్రం తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. శ్రీవిష్ణు, కేతిక శర్మ, ఇవానా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు కార్తీక్ రాజు దర్శకత్వం వహించాడు. గీతా ఆర్ట్స్ పతాకంపై విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మాతలుగా వ్యవహారించారు. వెన్నెల కిశోర్, వీటీవీ గణేష్ ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. మే 09న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. విజయ్(శ్రీవిష్ణు) ఓ బ్యాంక్‌లో ఉద్యోగి. తోటివారంతా లవర్స్‌తో సెటిలైపోతుంటే.. తానుమాత్రం ఇంకా సింగిల్‌గానే ఉండటం విజయ్ భరించలేకపోతుంటాడు. అలాంటి సందర్భంలో తనకు పూర్వ(కేతిక) తారసపడుతుంది. తొలి ప్రేమలోనే తను ప్రేమలో పడిపోతాడు. ఆమెను ప్రేమలో పడేసేందుకు సమస్త ప్రయత్నాలూ చేస్తుంటాడు. ఇదిలావుంటే.. హరిణి(ఇవానా) అనే డాన్స్ టీచర్ విజయ్‌ని ప్రేమిస్తూ వుంటుంది. విజయ్‌ని ఎలాగైనా ప్రేమలో పడేసేందుకు తను ప్రయత్నిస్తుంటుంది. మరి పూర్వని విజయ్ ప్రేమలో పడేశాడా? హరిణి ప్రయత్నం సఫలం అయ్యిందా? హరిణి, విజయ్ ఇద్దరిలో ఎవరి ప్రేమ గెలిచింది? ప్రేమ అంటూ గెలిస్తే.. మరి ఈ సినిమాకు 'సింగిల్' అనే టైటిల్ ఎందుకు పెట్టారు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే మిగతా కథ.

# అలా అనడం కరెక్ట్ కాదు


**తెలంగాణవీణ, సినిమా :**
తెలుగు సినిమా అదృష్టంపై ఆధారపడే పరిశ్రమ. ఇక్కడ హిట్టే ముఖ్యం. విజయాలే ఇక్కడ అవకాశాలు తెచ్చిపెడుతుంటాయి. అందుకే ఉన్నంతలో విభిన్న కథల్ని ఎంచుకుంటూ ముందుకెళ్తున్నది తెలుగమ్మాయి రీతూ వర్మ. పాత్రల్లో వైవిధ్యాన్ని చూపిస్తూ తానుంటే సినిమాకెళ్లే ఆడియన్స్‌ని సంపాదించుకుంది. ఈమె నటించిన 'దేవిక అండ డానీ' అనే వెబ్ సిరీస్ నేటి నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రీతూ మాట్లాడుతూ 'సినిమా అనేది టీమ్ వర్క్.హిట్టూ, ఫ్లాపూ ఒకరి చేతిలో ఉండదు. హిట్ అయితే క్రెడిట్ ఒకరే కొట్టేయడం, ఫ్లాప్ అయితే ఏ ఒక్క వ్యక్తినో నిందించడం సబబు కాదు. చాలాసార్లు ఫ్లాప్ అయితే హీరోహీరోయిన్లపై నిందలేస్తుంటారు. ఇంకా మాట్లాడితే గోల్డెన్ లెగ్, ఐరన్ లెగ్ అంటూ బిరుదులిచ్చేస్తుంటారు. తొలినాళ్లలో నేను నటించిన సినిమా సరిగ్గా ఆడకపోతే బాధపడేదాన్ని. ఇప్పుడైతే పట్టించుకోవడం మానేశా. సినిమా ఫలితం దైవాధీనం.. అంతే. ప్రస్తుతమైతే నా ఫోకస్ అంతా నటనపైనే. విభిన్నమైన పాత్రలు చేయాలనే కోరిక ఉంది' అని చెప్పుకొచ్చింది





# హరి హర వీర మల్లు' విడుదల వాయిదా..

## ప్రకటించిన నిర్మాత




**తెలంగాణవీణ, సినిమా :**
పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'హరి హర వీర మల్లు' విడుదల తేదీ మళ్లీ వాయిదా పడింది. ఈ మేరకు చిత్ర నిర్మాతలు అధికారిక ప్రకటన విడుదల చేశారు. ముందుగా ప్రకటించిన డేట్ ప్రకారం జూన్ 12న ఈ సినిమా విడుదల కావట్లేదని త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. పవన్ కళ్యాణ్ ఇమేజ్‌ని దృష్టిలో ఉంచుకుని ఈ సినిమాను అత్యుత్తమ చిత్రంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతోనే సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది.అలాగే సోషల్ మీడియాలో ఈ సినిమా గురించి వస్తున్న రూమర్స్‌తో పాటు గాసిప్ వార్తలను నమ్మకండంటూ చిత్రబృందం తెలిపింది. కేవలం చిత్రయూనిట్‌కి చెందిన అధికారిక హ్యాండిల్స్ ద్వారా వచ్చే అప్‌డేట్‌లను మాత్రమే నమ్మాలని అభిమానులను కోరింది. ఈ సినిమా విడుదల తేదీతో పాటు ట్రైలర్‌ను త్వరలోనే విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించి

# ఓటీటీలోకి వచ్చేసిన రజనీకాంత్ 'లాల్ సలామ్'

**తెలంగాణవీణ, సినిమా :**
తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రలో నటించిన లాల్ సలామ్ చిత్రం ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేసింది. ప్రస్తుతం ఈ సినిమా ఓటీటీ వేదిక అయిన ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. గతేడాది ఫిబ్రవరి 09న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం థియేటర్లలో ఆశించినంత విజయం అందుకోలేకపోయింది. అయితే ఈ సినిమా విడుదలైన దాదాపు ఏడాది తర్వాత ఓటీటీలోకి వచ్చేసింది. థియేటర్‌లో కట్ వెర్షన్‌ని విడుదల చేయగా.. ఓటీటీలో మాత్రం ఎక్స్‌టెండెడ్ వెర్షన్‌ని విడుదల చేసినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఐశ్వర్య రజినీకాంత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో విష్ణు విశాల్, విక్రాంత్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. ఇండియన్ మాజీ దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్ ఈ సినిమాలో కీలక పాత్రలో నటించాడు.కథ విషయానికి వస్తే.. 1990 బ్యాక్‌డ్రాప్‌లో ఈ స్టోరీ ఉంటుంది. కసుమూరు అనే గ్రామంలో హిందూ, ముస్లింలు ఎంతో ఐకమత్యంగా కలిసిమెలిసి ఉంటారు. ఈ ఊరిలో ఒకరైన మొయిద్దీన్ (రజనీకాంత్) కసుమూరు నుంచి ముంబయికి వలస వెళ్లి, అక్కడ అంచలంచెలుగా ఎదిగి ఓ గొప్ప వ్యాపారవేత్తగా మారతాడు. అయితే తన ఏకైక కుమారుడు షంషుద్దీన్ (విక్రాంత్) ను ఓ గొప్ప క్రికెటర్‌గా చూడాలన్నది మొయిద్దీన్ కల. అయితే, మొయిద్దీన్ గ్రామం వదిలి వెళ్ళిన తర్వాత, కొందరు రాజకీయ నాయకులు వారి అవసరాలు కోసం ప్రజలు మధ్య మత అలజడులను సృష్టిస్తారు. ఈ క్రమంలోనే కనుమూరులో త్రీస్టార్, ఎంసీసీ రెండు క్రికెట్ జట్ల మధ్య జరిగే మ్యాచ్ కూడా మతం రంగు పులుముకుంటుంది. ఒకరోజు ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుండగా, పెద్ద గొడవ జరుగుతుంది. ఈ ఘర్షణలోనే గురు అలియాస్ గురునాథం (విష్ణు విశాల్) షంషుద్దీన్ చేతిని నరికేస్తాడు. అయితే అసలు క్రికెట్‌లో జరిగిన ఆ గొడవకు కారణమేమిటి? షంషుద్దీన్ చేయి నరికేసేంత కోపం గురుకు ఎందుకొచ్చింది?తన కొడుకు చేయి నరికిన గురుపై మొయిద్దీన్ ఎలా స్పందించాడు? గ్రామంలో జరిగే జాతరకు, ఈ మత కల్లోలాల కథకు ఉన్న సంబంధం ఏమిటి? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

Published and printed by ulloju Srinivas on behlf of Veena publications printed at telangana Veena plot no.204 Maitri apartments.opp BSNL office ECIL kapra,med responsible for selection of news under the prb